


# విభారె తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 20 జూలై 2021 సంపుటి : 02 సంచిక :355 పేజీలు : 4 వెల : రూ 3-00







## తొలిరోజే విపక్షాల ఆందోళనలతో

# దద్దరిల్లిన రాజ్యసభ



న్యూఢిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే విపక్షాల ఆందోళనలతో ఉభయసభలూ దద్దరిల్లాయి. రాజ్యసభలో చైర్‌పర్సన్ ఎం.వెంకయ్యనాయుడు ప్రసంగిస్తుండగానే సభ్యులు ఆందోళనకు దిగడంతో మధ్యాహ్నం 2 గంటల వరకూ సభను ఆయన వాయిదా వేశారు. సోమవారం మొదలైన సమావేశాలు ఆగస్టు 13వ తేదీ వరకూ జరుగుతాయి."సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే విపక్ష ఎంపీలు వ్యవహరించిన తీరును మేము ఖండిస్తున్నాం. ఇటు రాజ్యసభ అటు లోక్‌సభలో దురదృష్టకర పరిస్థితిని చూడాల్సి వచ్చింది. చైర్మన్ ప్రసంగిస్తుండగానే విపక్ష ఎంపీలు అడ్డుకున్నారు" అని పీయూష్ గోయల్ మీడియాతో మాట్లాడుతూ అన్నారు.రైతుల నిరసనలు, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల, కోవిడ్ మహమ్మారిని ఎదుర్కొనే అంశాలతో సహా పలు అంశాలపై బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వ వైఖరిని విపక్షాలు ఎండగట్టే ప్రయత్నం చేశాయి. ద్రవ్యోల్బణం, రైతు అంశాలు, ఇంధన ధరల పెరుగుదలపై చర్చించేందుకు రాజ్యసభలో బిజినెస్ అవర్ సస్పెన్షన్‌కు కాంగ్రెస్ నోటీసు ఇచ్చింది. "ద్రవ్యోల్బణం, రైతు అంశాలపై చర్చకు నోటీసు ఇచ్చాం. బిజినెస్ అడ్వయిజరీ కమిటీ ఆమోదించాల్సి ఉంది. ఇవే అంశాలు సభలో మేము ప్రస్తావిస్తావిస్తాం' అని రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే అన్నారు. బిజినెస్ అవర్ రద్దు చేసి ఇంధనం, నిత్యావసర ధరల పెరుగుదలపై చర్చించాలని, తక్షణమే ప్రభుత్వం ఉపశమన చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌పై 267 నిబంధన కింద కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ నోటీసు ఇచ్చారు.మరోవైపు, పలువురు విపక్ష నేతలు సైతం రైతుల నిరసనలు, ఇంధనం ధరల పెరుగుదలపై చర్చించాలంటూ నోటీసులు ఇచ్చారు. సీపీఎం ఎంపీ ఇళమరం కరీం, డాక్టర్ వి.శివదేశన్‌లు 267 రూల్ కింద బిజినెస్ అవర్ సస్పెన్షన్ కోరుతూ నోటీసు ఉచ్చారు. డిఎంకే రాజ్యసభ ఎంపీ తిరుచ్చి శివ సైతం ఇదే నిబంధన కింద మేకేదాటు డ్యామ్ అంశంపై చర్చకు నోటీసు ఇచ్చారు.

## అమరావతి భూముల కొనుగోలు కేసుపై సుప్రీంకోర్టులో విచారణ

ఢిల్లీ: అమరావతి భూముల కొనుగోలు కేసుపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దేవ్ వాదనలు ప్రారంభించారు. భూముల బదలాయింపు చట్టం ప్రకారం కొనుగోలుదారులు... భూములను ఎందుకు కొనుగోలు చేస్తున్నారో అమ్మకందారులకు చెప్పాలన్నారు. ఈ విషయంలో అమ్మకం దారులు మోసపోయారని.. కొనుగోలుదారులు ప్రభుత్వ అధికారులతో కుమ్మక్కై భూములను కొనుగోలు చేశారని దుష్యంత్ పేర్కొన్నారు.



## దేశంలో 40 కోట్ల మంది బాహుబలులున్నారు: మోదీ

### కఠిన ప్రశ్నలు అడగండి.. కానీ సమాధానం చెప్పనివ్వండి విపక్షాలకు ప్రధాని నరేంద్ర మోదీ అభ్యర్థన



న్యూఢిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మీడియాతో మాట్లాడారు. "విపక్ష ఎంపీలు పదునైన ప్రశ్నలు అడగాలని కోరుకుంటున్నాను. అలానే ప్రభుత్వానికి సమాధానం చెప్పేందుకు తగిన సమయం ఇవ్వాలని ఆశిస్తున్నాను" అన్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా విపక్షాలు ఇంధన ధరల పెంపు, కొత్త వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు చేస్తోన్న నిరసన వంటి వివిధ అంశాలపై ప్రభుత్వాన్ని కార్నర్ చేయడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "నేను అన్ని పార్టీలు, ఎంపీలు హౌస్‌లో చాలా కష్టమైన, పదునైన ప్రశ్నలను అడగాలని కోరుకుంటున్నాను. కాని క్రమశిక్షణా వాతావరణంలో ప్రభుత్వం స్పందించడానికి అనుమతించాలి. ఇది ప్రజాస్వామ్యాన్ని పెంచుతుంది, ప్రజల విశ్వాసాన్ని బలోపేతం చేస్తుంది, అభివృద్ధి మార్గాన్ని మెరుగుపరుస్తుంది" అని తెలిపారు. కోవిడ్ వ్యాక్సిన్ మిమ్మల్ని బాహుబలిగా మారుస్తుంది.. కనుక ప్రతి ఒక్కరు టీకా వేసుకోవాలని నరేంద్ర మోదీ అభ్యర్థించారు. అలానే ప్రతి ఒక్కరు కోవిడ్ నిబంధనలు పాటించాలని కోరారు. "భుజాలకు టీకా తీసున్నవారంతా బాహుబలిగా మారతారు. ఇప్పటికే 40 కోట్ల మందికి పైగా ప్రజలు కనీసం ఒక్క డోస్ టీకా అయినా తీసుకుని బాహుబలులుగా మారారు. వైరస్ ప్రపంచాన్ని వణికిస్తుంది. దీని గురించి పార్లమెంటులో అర్థవంతమైన చర్చ జరగాలని ఆశిస్తున్నాను" అన్నారు మోదీ.

# అలసత్వం వద్దు.. నాణ్యత ఉండాలి: సీఎం జగన్

### పోలవరం పనుల పురోగతిపై సీఎం జగన్ సమీక్ష





పశ్చిమగోదావరి: పోలవరం పనుల పురోగతిపై అధికారులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. స్పిల్‌వే 42 గేట్లు అమర్చినట్టు సీఎంకు అధికారులు తెలిపారు. ఎగువ కాఫర్ డ్యాం పనులను పూర్తిచేశామన్న అధికారులు.. దిగువ కాఫర్ డ్యాం పనుల పరిస్థితిని వివరించారు. 2022 జూన్ కల్లా రెండు కాల్వలకు లింక్ పనులు పూర్తి కావాలని, టన్నెల్, లైనింగ్ పనులు పూర్తి చేయాలని సీఎం జగన్ ఆదేశించారు. ఎర్త్‌కం రాక్‌ఫిల్ డ్యామ్ పనులపై సీఎం ఆరా తీశారు.పోలవరం ప్రాజెక్టు సందర్శనలో భాగంగా సీఎం వైఎస్ జగన్.. సోమవారం ఏరియల్ సర్వే ద్వారా పోలవరం ప్రాజెక్టు పనులను వీక్షించారు. ఇప్పటివరకు జరిగిన ప్రాజెక్ట్ పనుల పురోగతిని సీఎంకు అధికారులు వివరించారు. పోలవరం నిర్వాసితులతో మాట్లాడిన సీఎం.. స్పిల్‌వే, అప్రోచ్ ఛానల్‌ను పరిశీలించిన తర్వాత పోలవరం పనుల ఫొటో గ్యాలరీని వీక్షించారు.అనంతరం పోలవరం ఆర్‌అండ్‌ఆర్‌పై సమీక్ష నిర్వహించిన సీఎం.. ఆర్ అండ్ ఆర్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. "ఆర్ అండ్ ఆర్ పనులపై దృష్టి పెట్టాలి. ఆర్ అండ్ ఆర్ పనులు పూర్తి నాణ్యతతో ఉండాలి. కచ్చితంగా నాణ్యత పాటించేలా అధికారిని నియమించాలి. కాలనీల నిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలి. వరదల సమయంలో నిర్వాసితులకు పునరావాసం ఏర్పాటు చేయాలి. పనులకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం సొంత నిధులు ఇస్తోంది. వచ్చే నెల ఆర్ అండ్ ఆర్ కాలనీలను సందర్శిస్తా. నిర్వాసితులకు జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి పెట్టాలి. ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాలు ఉన్నవారికి తిరిగి ఇచ్చేందుకు భూములు గుర్తించాలి. అనుకున్న లక్ష్యంలోగా ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలని" సీఎం జగన్ ఆదేశించారు.


### వైసీపీ రాజకీయ నిరుద్యోగులకు జగన్ ఉద్యోగాలిచ్చారు: నారా లోకేష్

అమరావతి: నిరుద్యోగుల ఉద్యమాన్ని నిర్బంధంతో అణచివేయలేరని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. నేడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ రాజకీయ నిరుద్యోగులకు సీఎం జగన్ ఉద్యోగాలిచ్చారన్నారు. రాష్ట్ర నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఎక్కడో సమాధానం చెప్పాలన్నారు. అక్రమ అరెస్టులతో యువతను అడ్డుకోవాలనుకోవడం అసాధ్యమన్నారు. నిర్బంధాలను అధిగమించి సీఎం ఇంటిని యువత ముట్టడించిందన్నారు. ఇప్పటికైనా నిరుద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఎంతమంది పోలీసులు వచ్చినా ఆందోళనలను అడ్డుకోలేరని నారా లోకేష్ పేర్కొన్నారు.

## ఉద్యోగాల భర్తీపై టీడీపీ తప్పుడు ప్రచారం

### ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తాడేపల్లి: ప్రభుత్వం ఏ మంచి పని చేసినా విమర్శించడమే టీడీపీకి అలవాటని ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, గ్రామ సచివాలయాల్లో ఉద్యోగ నియామకాలు ప్రకటించిన వెంటనే నిరుద్యోగుల మనోభావాలను గాయపరిచేలా చంద్రబాబు విమర్శలు చేశారని ధ్వజమెత్తారు.



ఉద్యోగాల భర్తీపై టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని, చంద్రబాబు తన హయాంలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. "కేవలం రెండేళ్లలో లక్షా 84 వేల ఉద్యోగాలు ఇచ్చాం. 4 లక్షల ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ప్రాదిపదికన 20 వేల ఉద్యోగాలు ఇచ్చామని" వివరించారు. వచ్చే ఏడాది మరిన్ని ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని కాకాణి వెల్లడించారు."టీడీపీలో ఉచ్చులో వామపక్షాలు పడటం దురదుష్టకరం. లోకేష్.. ఉద్యోగాల గురించి మాట్లాడటం దౌర్భాగ్యం. నిరుద్యోగులకు ఇచ్చిన మాటకు కట్టుబడి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చింది. ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చాలనే ఉద్దేశంతో నిరసనలకు పిలుపునిచ్చారు. గతంలో నిరుద్యోగులను వంచించిన చంద్రబాబు.. ఇవాళ నిరుద్యోగులకు మాయమాటలు చెబుతున్నారంటూ" ఎమ్మెల్యే కాకాణి నిప్పులు చెరిగారు.

## పోలవరంలో ముగిసిన

# సీఎం జగన్ పర్యటన

పశ్చిమగోదావరి: పోలవరం ప్రాజెక్టు సందర్శనలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏరియల్ సర్వే ద్వారా పోలవరం ప్రాజెక్టు పనులను వీక్షించారు. అధికారులతో కలిసి సీఎం జగన్ క్షేత్రస్థాయిలో పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించారు. పోలవరం ప్రాజెక్టును హిల్ వ్యూ పాయింట్ వద్ద నుంచి సీఎం స్వయంగా పరిశీలించారు. ఇప్పటివరకు జరిగిన ప్రాజెక్ట్ పనుల పురోగతిని అధికారులు సీఎం జగన్‌కు వివరించారు. అనంతరం సీఎం జగన్ పోలవరం నిర్వాసితులతో మాట్లాడారు. స్పిల్‌వే, అప్రోచ్ ఛానల్‌ను సీఎం వైఎస్ జగన్ పరిశీలించి, అనంతరం పోలవరం పనుల ఫొటో గ్యాలరీని వీక్షించారు. సీఎం జగన్‌తో పాటు నీటిపారుదల శాఖ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, అధికారులు ఉన్నారు. పోలవరం ప్రాజెక్టు పరిశీలనలో వెల్లడైన అంశాల ఆధారంగా మధ్యాహ్నం



అధికారులతో సీఎం వైఎస్ జగన్ సమీక్ష నిర్వహించారు. గడువులోగా పోలవరం పనులు పూర్తిచేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం సీఎం జగన్ పోలవరం పర్యటన ముగించుకొని తాడేపల్లికి బయలుదేరారు.పోలవరం పనుల పురోగతిపై అధికారులతో సీఎం జగన్ జరిపిన సమీక్షలో స్పిల్‌వే 42 గేట్లు అమర్చినట్టు తెలిపిన అధికారులు.. ఎగువ కాఫర్ డ్యాం పనులను పూర్తి చేశామని తెలిపారు. అదే సమయంలో దిగువ కాఫర్ డ్యాం పనుల పరిస్థితిని అధికారులు వివరించగా, 2022 జూన్ కల్లా రెండు కాల్వలకు లింక్ పనులు పూర్తి కావాలని, టన్నెల్, లైనింగ్ పనులు పూర్తి చేయాలని సీఎం జగన్ సూచించారు.

## లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీల ఆందోళన

### పోలవరంపై చర్చకు పట్టు

న్యూఢిల్లీ: లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఆందోళనకు దిగారు. పోలవరంపై చర్చకు వైఎస్సార్‌సీపీ ఎంపీలు పట్టుబట్టారు. వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్ సవరించిన అంచనాలకు ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. వాయిదా తీర్మానానికి ఎంపీ మిథున్ రెడ్డి నోటీసు ఇచ్చారు. ఈ క్రమంలో... మధ్యాహ్నం 3:30 వరకు లోక్‌సభ వాయిదా వేశారు.ఇక పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్ట్‌గా ప్రకటించినా.. కేంద్రం పటించుకోవడం లేదని వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటు సమావేశాల సందర్భంగా సోమవారం.. వైఎస్సార్‌సీపీ ఎంపీలు వంగా గీత, చంద్రశేఖర్, గురుమూర్తి.. పోలవరం ప్రాజెక్ట్ అంశం మీద లోక్‌సభలో వాయిదా తీర్మానం ఇచ్చారు.



# సంపాదకీయం

మంగళవారం 20 జూలై 2021

## తెగేదాకా... లాగుతున్నారు.....

తెలుగు రాష్ట్రాల సీఎంలు రోడెక్కారు... ఆగర్భ శత్రువుల్లా స్టేట్ మెంట్లు ఇచ్చుకున్నారు. పిట్టల తగవు పిల్లి తీర్చేసింది. దేహీ అంటూ ఇక ముందు రెండు తెలుగు రాష్ట్రాలు అంగలార్చాల్సిందే. చేజేతులారా తమ స్వయం నిర్ణయాధికారాన్ని కేంద్రానికి తాకట్టు పెట్టారు. కృష్ణ.గోదావరి నదీ యాజమాన్యాల బోర్డుల పేరిట ఉమ్మడి జలాలపై కేంద్రం పెత్తనం చేయబోతోంది. దీనికి ఎవరినీ తప్పు పట్టి లాభం లేదు. కేంద్రాన్ని కూడా వేలెత్తి చూపించలేం. స్వార్థ రాజకీయ ప్రయోజనాలు, ఆధిపత్య ధోరణులు, పరస్పర అనుమానాల నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల స్వయంకృతాపరాధమిది. ఇతర రాష్ట్రాల్లోనూ అనేక జలవివాదాలున్నాయి. కానీ కేంద్రం సాధ్యమైనంతవరకూ వాటి జోలికి పోదు. రాష్ట్ర విభజన చట్టం కల్పించిన ఆసరాతో ఇప్పుడు ఆ అవకాశం వచ్చింది. అయినా ఏడేళ్లలో ముఖ్యమంత్రులు పరస్పరం అంగీకారానికి రాకపోవడమే ఈ అనర్థానికి దారి తీసింది. బోర్డుల యాజమాన్యంతో గొడవలు తీరిపోతాయనుకోవడం భ్రమ. పరస్పరం విమర్శించుకుంటూనే కేంద్రం ముందు మోకరిల్లకతప్పదు.రాష్ట్ర విభజన తర్వాత రెండు రాష్ట్రాల్లోనూ రెండు ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. గోదావరి నదిపై పరస్పరం అనధికారికమైన అవగాహనకు వచ్చారు ముఖ్యమంత్రులు. చంద్రబాబు నాయుడి సమయంలో పట్టిసీమల ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ సమర్థించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో చంద్రబాబు నాయుడు మౌనం వహించారు. ఆరకంగా రెండు రాష్ట్రాలకు ప్రయోజనం సమకూరింది. కృష్ణ విషయంలో పరస్పరం పట్టుదలలు కొనసాగుతూ వచ్చాయి. అయినా ఒక్క సందర్భంలో మినహా నీటి విడుదల, పంపిణీలపై పెద్దగా గొడవలు జరగలేదు. కేంద్రం మధ్యవర్తిత్వంలో 2015లో ఒక తాత్కాలిక ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వం మారడంతో శాశ్వతమైన పరిష్కారం కుదురుతుందని అంతా ఆశించారు. తొలి ఏడాది కేసీఆర్, జగన్ ల మధ్య సుహృద్భావ సంబంధాలు కొనసాగాయి. ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో నదీజలాల సహా ఆస్తుల పంపిణీ సైతం పూర్తయిపోతుందని భావించారు. రాజకీయ కారణాలతో ఇరువైపులా అనధికారికంగా నిర్మాణం సాగుతున్న ప్రాజెక్టులకు ఒకరికొకరు మోకాలడ్డుపెట్టుకున్నారు. పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. ఫలితంగా మొత్తం నిర్మాణంలో ఉన్న ఎత్తిపోతలు, చిన్న తరహా ప్రాజెక్టులన్నీ నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. కొత్త నిర్మాణాలకు ఆరునెలల్లోపు అనుమతులు తెచ్చుకోవాలని , లేకపోతే వాటిని కొనసాగించడానికి వీల్లేదని కేంద్రం చెప్పేసింది. జలవనరులు, పర్యావరణ, అటవీ శాఖల నుంచి అనుమతులు అంత సులభంగా వచ్చేవి కావు. గతంలో ముందుగా నిర్మాణాలు పూర్తి చేసి , ఆ తర్వాత కాలంలో అనుమతులు తెచ్చుకునేవారు. ఇప్పుడు ఆ అవకాశం రెండు రాష్ట్రాల చేతుల నుంచి జారిపోయింది.గోదావరి ప్రాజెక్టులపై పెద్దగా చింత పడాల్సిన పని లేదు. దాదాపు కాళేశ్వరం పూర్తయిపోయింది. పోలవరం జాతీయ ప్రాజెక్టు . ఎలాగూ ఎప్పటికైనా నిర్మాణం చేయకతప్పదు. నీరు సమృద్ధిగా లభిస్తుంది కాబట్టి దానిపై చింత పెట్టుకోనక్కర్లేదు. గోదావరి బోర్డు ఏర్పాటైనా పెద్దగా నష్టం వాటిల్లదు. కానీ కృష్ణా విషయంలో మొత్తం ప్రాజెక్టులు, కాలువలు, నీటి విడుదల యంత్రాంగం, జల విద్యుత్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు అన్నీ కృష్ణ బోర్డు పరిధిలోకి వచ్చేస్తున్నాయి. ఇందుకు అవసరమైన సిబ్బంది సహా , సాంకేతిక , ఆర్థిక అవసరాలన్నిటికీ నిధులు రెండు రాష్ట్రాలు సమకూర్చాలి. పెత్తనం మాత్రం కేంద్రం చేస్తుంది. తమకు పంపకాల్లో వచ్చిన వాటాను సైతం నచ్చినట్లు, అవసరానికి అనుగుణంగా వాడుకునే వెసులుబాటు ఉండదు. సిస్టం పేరు చెప్పి బోర్డు రకరకాలుగా ఆలోచించిన తర్వాతనే నీటి విడుదల, పంపిణీ వంటివి చేస్తుంది. అందువల్ల జాప్యం చోటు చేసుకొంటుంది. రెండు రాష్ట్రాలు నష్టపోయే అవకాశాలున్నాయి.అన్నదమ్ముల్లా కూర్చుని పరిష్కరించుకోవాల్సిన అంశాన్ని తెగేదాకా లాగుకున్నారు. కనీసం ఒక అవగాహనకు వచ్చి , ఒప్పందం కుదుర్చుకుని ఉంటే బాగుండేది. దానినే బోర్డు అమలు చేసి ఉండేది. ఆ మాత్రం పరిష్కారం చేసుకోకపోవడం వల్ల ఈ రాష్ట్రాలతో ఏమాత్రం సంబంధం లేని ఛైర్మన్ల ఆధ్వర్యంలోనే ఇకపై నీటి విడుదల ఆధారపడుతుంది. డిండి మొదలు పోతిరెడ్డి పాడు వరకూ అనధికారికంగా కట్టుకున్న ప్రాజెక్టులు అన్నిటికీ ముప్పు తప్పదు. నియమనిబంధనల ప్రకారం వాటికి భవిష్యత్తులో నీటి పంపిణీ ఉండకపోవచ్చు. అంతేకాకుండా తాజాగా ఏర్పాటైన బోర్డులు తెలంగాణ, ఆంధ్రాలపైనే పెత్తనం చేస్తాయి. అటు కర్ణాటక, మహారాష్ట్రలకు ఇప్పటికే ట్రిబ్యునల్ ప్రకారం కేటాయింపులు ఉన్నాయి. వాటి జోలికి పోవు. దీనివల్ల రాజకీయ పలుకుబడితో కర్టాటక, మహారాష్ట్రలు దిగువన పెత్తనం చేసే బోర్డులను నియంత్రించే అవకాశం ఉంటుంది. కేంద్రంలో బీజేపీ, కాంగ్రెసులకు కర్ణాటక, మహారాష్ట్రలో రాజకీయ పరమైన అవసరాలు చాలా ఎక్కువ. అందువల్ల ఆ రాష్ట్రాలు నీటిపై పెత్తనం చేస్తున్నప్పటికీ చూసీ చూడనట్లు వ్యవహరించే ప్రమాదం ఉంది. ఎంతైనా రాజకీయ ఒత్తిడితో కూడిన యంత్రాంగం లేకపోతే ఉదాసీనత నెలకొంటుంది. ఇది తెలుగు రాష్ట్రాలకు నష్టదాయకమే. కానీ ఇప్పటికే తమ తలకు తామే కొరివి పెట్టుకున్నాయి ప్రభుత్వాలు. న్యాయబద్ధమైన వాటాల కోసం ఎదురు చూడటమే మిగిలింది. చెరపకురా చెడేవు అంటారు. రాజకీయాల్లో అది నూటికి నూరుపాళ్లు నిజం. అటు పోతిరెడ్డిపాడుపై అత్యుత్సాహం చూపించి ఆంధ్రప్రదేశ్, ఇటు జలవిద్యుత్ తో నీటిని వృథా చేసి తెలంగాణ రాజకీయం చేస్తున్నామనుకున్నాయి. మొదటికే చేటు తెచ్చుకున్నాయి.

# తమ్ముని ఇంట్లో ఆనందం.. అన్న ఇంట్లో విచారం

శ్రీకాకుళం, జూలై 19, (న్యూస్ పల్స్)జగన్ రాజకీయమే వేరు. ఏపీలోని మొత్తం 175 నియోజకవర్గాల మీద ఆయనకు అవగాహన ఉంది. అంతే కాదు, టీడీపీ ఎక్కడ బలంగా ఉందో చూసి మరీ గట్టి దెబ్బ కొడుతున్నారు. అదే విధంగా తెల్లారిలేస్తే తన మీద పెద్ద నోరేసుకుని విరుచుకుపడిపోతున్న నేతలకు కూడా సమయం చూసి షాక్ ఇచ్చేయడం జగన్ కి అలవాటే. విశాఖ జిల్లా విషయానికి వస్తే తెలుగుదేశం పొలిట్ బ్యూరో మెంబర్, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఇంట్లో కుంపటి పెట్టి ఆయన్ని పాతిక వేల ఓట్ల తేడాతో ఓడించిన జగన్ వ్యూహం ఇపుడు మరో మారు పదునెక్కింది. ఏకంగా ఆయన తమ్ముడు కుటుంబానికి క్యాబినేట్ ర్యాంక్ పదవిని జగన్ ఇచ్చేశారు. విశాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్ పర్సన్ గా అయ్యన్నపాత్రుడు మరదలు అనితను నియమించి టీడీపీకే నోట మాట రాకుండా చేశారు. అయ్యన్నపాత్రుడు తమ్ముడు సన్యాసిపాత్రుడు ఎన్నికల ముందు వైసీపీలో చేరి అన్న ఫ్యామిలీని టార్గెట్ చేశారు. అయ్యన్నపాత్రుడు ఓటమిలో ఆయన వాటా కూడా ఉంది. ఇక ఈ మధ్య జరిగిన నర్సీపట్నం మునిసిపాలిటీ ఎన్నికల్లో కూడా అయ్యన్న కుటుంబం ఓడడానికి తమ్ముడు కీ రోల్ ప్లే చేశారు. దానికి బహుమతిగా ఆయన సతీమణి అనితకు ప్రతిష్టాత్మకమైన పదవినే జగన్ ఇచ్చారు. దీంతో తమ్ముడి ఇంట ఆనందం తాండవిస్తూండగా అయ్యన్నపాత్రుడు మాత్రం ఇరకాటంలో పడ్డారనే చెప్పాలి.రామలక్ష్మణులుగా మెలిగిన తమ్ముళ్ల మధ్య రాజకీయమే చిచ్చు రేపింది. అన్న తరువాత ఒకసారి అయినా ఎమ్మెల్యే కావాలని సన్యాసిపాత్రుడు తలపోశారు. కానీ అయ్యన్నపాత్రుడు తన కొడుకు విజయ్ పాత్రుడికే పట్టం అంటూ తమ్ముడికి ఝలక్ ఇచ్చేశారు. దాంతో మూడు దశాబ్దాల రాజకీయ బంధాన్ని టీడీపీతో సన్యాసిపాత్రుడు తెంచుకున్నారు. అలాగే అన్నతో రక్తబంధానికి దూరంగా ఉన్నారు. ఇక సన్యాసిపాత్రుడు సతీమణి అనిత నర్సీపట్నం మునిసిపాలిటీ వైఎస్ చైర్ పర్సన్ గా గత అయిదేళ్ళూ పాలించారు. ఆమె అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని సన్యాసిపాత్రుడికి జగన్ బిగ్ ఆఫర్ ఇచ్చేశారు. ఇపుడు ఆయనే ఆయుధంగా రాజకీయంగా అయ్యన్నపాత్రుడును మరింత దెబ్బ

తీసేందుకు పావులు కదుపుతున్నారు.అయ్యన్నపాత్రుడు రాజకీయం అంతా తమ్ముడి మీదనే ఆధారపడి సాగింది. అయ్యన్న ఎక్కడా ఉన్నా తమ్ముడు అందుబాటులో అటు ప్రజలకు, ఇటు క్యాడర్ కి ఉంటూ వచ్చేవారు. అలాంటి పని ఇపుడు కొడుకు చేయడం అంటే కష్టమే. పైగా విజయ్ కి అనుభవం తక్కువ. అయితే కొడుకే తన వారసుడు అని అయ్యన్నపాత్రుడు భావించడం వల్లనే ఆయన రాజకీయం కష్టాలలో పడింది అంటారు. అన్నదమ్ములు కలిస్తే మాత్రం తిరుగులేదు. కానీ కలవనీయకుండా కొడుకు విజయ్ ఉన్నారు. దాంతో నర్సీపట్నంలో అయ్యన్నపాత్రుడు రాజకీయ శకం ఇలాగే ముగిసిపోతుందా అన్న డౌట్లు అయితే అందరికీ వస్తున్నాయి. మొత్తానికి పులి లాంటి అయ్యన్నపాత్రుడు ఇపుడు రాజకీయంగా ఏమీ కాకుండా ఉంటే తమ్ముడి ఫ్యామిలీలో మాత్రం అధికార వైభోగం కనిపించడం పొలిటికల్ గా చిత్రమే అంటున్నారు.


# నమ్ముకున్నోళ్లకే నామినేటెడ్

విజయవాడ, జూలై 19, (న్యూస్ పల్స్)జగన్ తన మాట నిలబెట్టుకున్నారు. ఏ ఒక్కరినీ మరచిపోలేదు. తనతో పాదం కదిపిన వారంతా ఆయనకు గుర్తే. తన వెంట కష్టాలలో పడి నలిగిన వారు అంటే గౌరవమే. అన్నింటికీ మించి విదేయతకు జగన్ పెద్ద పీట వేశారు. జగన్ కోసం ఆస్తులు తగలేసుకుని నాడు కాంగ్రెస్, తరువాత టీడీపీ ప్రభుత్వాల నుంచి అనేక వేధింపులను ఎదుర్కొన్న వారందరినీ పిలిచి మరీ పెద్ద పీట వేశారు. వారి బయోడేటా తన దగ్గర ఉందని చెప్పకుండానే చెప్పి పదవులు ఇచ్చి షాక్ తినిపించేశారు. దటీజ్ జగన్ అనిపించుకున్నారు.జిల్లాలో పదవులు అందుకున్న వారి జాబితా చూసిన పార్టీ నాయకులు అంతా ఒక్కటే మాట అంటున్నారు. న్యాయం జరిగింది అన్నదే ఆ మాట. సాధారణంగా పదవుల పంపిణీ జరిగినపుడు విమర్శలు, అలకలు అసంతృప్తులు సొంత పార్టీ నుంచే వస్తాయి. కానీ వైసీపీలో మాత్రం ఆలా జరగకపోవడం విశేషం. పైగా పదవులు ఆశించి భంగపడిన వారు సైతం జగన్ అందరినీ బాగా గమనిస్తున్నారని, ఆయన తప్పక న్యాయం చేస్తారని విశ్వాసం కనబరచడం విశేషం. అదే విధంగా సీనియర్లకు పదవులు దక్కడం మంచి పరిణామమేనని, ఇవాళ వారి వంతు, ఇదే తీరున కష్టపడితే రేపు తమ వంతు కూడా అంటూ వారు అనడం వైసీపీలో ఒక విశేషం పరిణామంగానే చూడాలి మరి.ఎన్నికలు జరిగి రెండున్నరేళ్ళు అయింది. విశాఖ సిటీలో ఎన్నికల్లో పోటీ చేసిన చోట వైసీపీ ఓటమి పాలు కాగా టీడీపీ గెలిచింది. అలా సిటీకి నాలుగు దిక్కులా పార్టీకి ఇబ్బందులు వచ్చాయి. అయితే లోకల్ బాడీ ఎన్నికలు వచ్చేనాటికి వైసీపీ పుంజుకుని ఓడిన చోటనే జెండా ఎగరేసింది. దాని కోసం శ్రమించిన పార్టీ నేతలను గుర్తు పెట్టుకుని మరీ జగన్ పదవులు పంపిణీ చేశారు. పశ్చిమలో మాజీ ఎమ్మెల్యే మళ్ళ విజయప్రసాద్, ఉత్తరంలో ఓడిన కేకే రాజులకు సముచిత స్థానమే దక్కింది. కీలకమైన కార్పోరేషన్లు వీరికి దక్కాయి. ఇక దక్షిణంలో చూసుకుంటే మైనారిటీ నాయకుడు జాన్ వెస్లీకి రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పోరేషన్ పదవి లభించింది. ఉత్తరానికే చెందిన మరో కీలక నాయకుడు చొక్కాకుల వెంకటరావు ఫ్యామిలీకి కూడా కాకినాడ విశాఖ మెట్రో రీజియన్ చైర్ పర్సన్ పదవి దక్కింది. గాజువాకలో రెడ్డికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిన జగన్ నామినేటెడ్ పదవులలో మాత్రం యాదవ సామాజిక వర్గానికి పెద్ద పీట వేసి అక్కడ టీడీపీకి షాక్ ఇచ్చారు.కష్టాలు వచ్చాయని బయటపడకుండా ఓర్చుకున్న వారికే ఇపుడు పదవులు వరించాయని అంటున్నారు. ఇక అధికారం ఎక్కడ ఉంటే అక్కడ వాలిపోయే నేతలకు మాత్రం జగన్ చుక్కలే చూపించారు. మీరింకా వైసీపీకి కొత్తవారే అంటూ కాస్తా ఓపిక పట్టమని చెప్పినట్లు అయింది. ఇతర పార్టీలలో సీనియారిటీ వైసీపీలో చూపించి పదవులు పొందాలనుకుంటే తన వద్ద కుదరదు అని సందేశం ఇచ్చారు. వైసీపీకి చమటోడ్చిందే తనకు క్రెడిటేరియా అని జగన్ చెప్పకనే చెప్పేశారు. అందువల్ల వైసీపీలో ఎవరూ నిరాశ పడాల్సింది లేదు. పనిచేస్తేనే పదవులు అన్న న్యాయ సూత్రాన్ని జగన్ అమలు చేస్తున్నందువల్ల షార్ట్ కట్ మెథడ్స్ లో కుర్చీలు పట్టాలనుకునే వారికి తప్ప మిగిలిన వారికి ఈ పంపిణీ నిండా ఆనందాన్ని నింపిందనే చెప్పాలి.

# 893 కోట్ల ఉపాధి నిధుల పెండింగ్.....

నెల్లూరు, జూలై 19, (న్యూస్ పల్స్)ఉపాధి హామీ చట్టం కింద పనులు చేసే కూలీలకు సకాలంలో కూలి చెల్లించడంలో జాప్యం జరుగుతోంది. గత ఆరు వారాలుగా కూలి చెల్లించకపోవడంతో ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. వ్యవసాయ పనులు కూడా పూర్తిగా ప్రారంభం కాక, చేసిన ఉపాధి పనుల డబ్బులు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరోనా కష్టకాలంలో కూడా వారాల తరబడి డబ్బులు చెల్లించకపోతే బతకడం ఎలా? అని కూలీలు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.893 కోట్లు ఉపాధి నిధులు పెండింగ్‌లో ఉన్నాయని, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి రాగానే కూలీల ఖాతాల్లోనే నేరుగా వేస్తామని ఉన్నతాధికారులు చెబుతున్నారు.రాష్ట్రంలో 67.27 లక్షలు జాబ్ కార్డులున్నాయి. ప్రస్తుతం 94.04 లక్షల మంది ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. ఈ ఏడాది కేంద్రం రాష్ట్రానికి కేటాయించిన 20 కోట్ల పనిదినాల్లో జులై 6 నాటికే 17.29 కోట్ల పనిదినాలను పూర్తి చేసి దేశంలోనే ఎపి మొదటి స్థానంలో నిలిచింది. కూలీలకు డబ్బులు చెల్లించడంలో మాత్రం జాప్యం చేస్తోంది. కేంద్రం నుంచి వస్తున్న ఉపాధి నిధులను సంక్షేమ పథకాలకు మళ్లించడం వల్లే ఈ జాప్యం జరుగుతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఉపాధి హామీ కూలీలకు రోజువారీ కూలి రూ.200 నుంచి రూ.250 వరకూ ఉంటుంది. పనిచేసిన తరువాత రెండు వారాలకోసారి వారి ఖాతాల్లో నేరుగా డబ్బులు జమవ్వాలి. కేంద్రం నుంచి నిధులు రావడం ఆలస్యమైతే ఒక్కోసారి మూడు నాలుగు వారాలకు జమవుతాయి. ఈసారి మాత్రం ఆరు వారాలు పూర్తి కావస్తున్నా... ఇంకా డబ్బులు పడలేదని చెబుతున్నారు. ఫలితంగా కుటుంబ పోషణకు అప్పులు చేయడం, కిరాణా దుకాణాల్లో అరువుపై సరుకులు తెచ్చుకుంటున్నట్లు వాపోతున్నారు. అత్యధికంగా విశాఖపట్నం జిల్లాలో రూ.120 కోట్లు పెండింగ్‌లో ఉండగా, విజయనగరంలో రూ.33 కోట్లు, శ్రీకాకుళంలో రూ.46 కోట్లు, తూర్పుగోదావరిలో రూ.91 కోట్లు, పశ్చిమగోదావరిలో రూ.88 కోట్లు, కృష్ణాలో రూ.75 కోట్లు, గుంటూరులో రూ.62 కోట్లు, నెల్లూరులో రూ.77 కోట్లు, ప్రకాశంలో రూ.55 కోట్లు, చిత్తూరులో రూ.65 కోట్లు, అనంతపురంలో రూ.94 కోట్లు, కర్నూలులో రూ.64 కోట్లు, కడపలో రూ.23 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉపాధి డబ్బులు చెల్లించాలని కూలీలు కోరుతున్నారు.

# పంచాయితీల్లో వైసీపీ వర్సెస్ టీడీపీ



ఏలూరు, జూలై 19, (న్యూస్ పల్స్)గ్రామాల్లో చేపట్టిన వివిధ నిర్మాణ పనులు వైసిపి, టిడిపి మద్దతుదారుల మధ్య వివాదానికి కారణమౌతున్నాయి. రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, మినీ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టిన సంగతి తెలిసిందే. వీటిని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇటీవల ఆదేశించారు. దీంతో అధికార యంత్రాంగం పనులను వేగంగా పూర్తి చేయడానికి కసరత్తు చేస్తోంది. నిబంధనల ప్రకారం ఈ పనులు ఆయా గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో జరగాలి. అయితే, టిడిపి అభ్యర్థుల గెలిచిన చోట్ల దీనికి భిన్నమైన పరిస్థితి నెలకొంది. ఆ గ్రామాల్లో కూడా వైసిపి నేతలే ఈ పనులపై పెత్తనం చెలాయిస్తున్నారు. ఓడిన వారి పెత్తనం ఏమిటంటూ టిడిపి సర్పంచ్‌లు ప్రశ్నించిన చోట్ల వివాదం నెలకొంటోంది. కొన్నిచోట్ల అధికారులు జోక్యం చేసుకుని టిడిపి సర్పంచ్‌లకు నచ్చ చెప్పే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. కొన్నిచోట్ల ఎంఎల్‌ఎలు మాట్లాడుతున్నారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, గోదావరి జిల్లాల్లో ఈ పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల మంత్రులు కూడా జోక్యం చేసుకుంటున్నట్లు తెలిసింది. అయినా టిడిపి సర్పంచ్‌లు వినని చోట్ల పనులు నిలిపివేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 300 గ్రామాల్లో వైసిపి నాయకులు ఇలా పనులను నిలిపివేసినట్లు సమాచారం.పనులను వేగవంతం చేసేందుకు గ్రామాల్లోకి వెళ్లగా ఈ 'పంచాయితీలు' ఎదురవుతున్నాయని పంచాయతీరాజ్‌శాఖకు చెందిన ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. వాస్తవానికి ఆర్‌బికెలు, సచివాలయాలు, మినీ ఆరోగ్యకేంద్రాల నిర్మాణానికి ఉపాధి హామీ నుంచి 90 శాతం నిధులు కేటాయించగా, పది శాతం స్థానిక పంచాయతీ భరించాలి. నిర్మాణ పనులు సర్పంచ్ ఆదీనంలో జరగాలన్నది నిబంధన. చాలా గ్రామాల్లో ఈ పనులు ప్రారంభించేనాటికి పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో అధికారంలో ఉన్న వైసిపి నేతలే ఈ పనులను చేపట్టారు. సచివాలయ నిర్మాణానికి రూ.35 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.22 లక్షలు, మినీ ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి రూ.14.8 లక్షల అంచనా వ్యయంతో పనులు ప్రారంభమయ్యాయి. ఆ తరువాత ఎన్నికలు జరిగాయి. టిడిపి సర్పంచ్‌లు గెలిచిన చోట తామే పనులు చేస్తామని అంటున్నారు. దీనికి వైసిపి నేతలు ఒప్పుకోకపోవడంతో పనులు నిలిచిపోతున్నాయి. విజయనగరం జిల్లాల్లో 14 పంచాయతీల్లోనూ, విశాఖ జిల్లాల్లోని 21, శ్రీకాకుళంలోని 26, గోదావరి జిల్లాల్లోని 43, కృష్ణాలోని 28, గుంటూరులో 32, నెల్లూరులో 10, ప్రకాశంలో 18, అనంతపురంలో 14, చిత్తూరులో 29, కడపలో 3, కర్నూలు జిల్లాలోని 23 పంచాయతీల్లో ఇటువంటి గొడవలు వల్ల పనులను నిలిపేసినట్లు విశ్వసనీయ సమాచారం.

## రాయలసీమ నేతలు సపోర్ట్ ఎటూ

కర్నూలూ, జూలై 19, (న్యూస్ పల్స్)జలజగడం ఇంత జటిలమవుతున్నా మాట్లాడాల్సినోళ్లు మాట్లాడటం లేదు. రాయలసీమకు అన్యాయం జరుగుతుందని గొంతెత్తి అరిచినోళ్లు సౌండ్ చేయడం లేదు. గత కొన్ని రోజులులగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ల మధ్య జలవివాదం జరుగుతుంది. ఇరు రాష్ట్రాలకు చెందిన మంత్రులు హద్దులు దాటి మాట్లాడుతున్నారు. ఎవరి రాష్ట్ర ప్రయోజనాల కోసం వారు అరిచి గోల చేస్తున్నారు. ఇదంతా రాజకీయ లబ్దికోసమేనని కొట్టిపారేస్తున్నా రాయలసీమ పరిరక్షణ సమితి నేత మైసూరారెడ్డి మాత్రం ఈ వివాదాన్ని పట్టించుకోనట్లే ఉండటం పొలిటికల్ సర్కిళ్లలో చర్చనీయాంశమైంది.మైసూరా రెడ్డి సీనియర్ నేత. రాజకీయంగా అనుభవమున్న ఆయన రాయలసీమ విషయంలో ఎందుకో ఈ మధ్య సైలెంట్ గానే ఉన్నారు. గతంలో జగన్, కేసీఆర్ లు కలసి గోదావరి జలాలను ఇరు రాష్ట్రాలు ఉపయోగించుకుందామని చర్చించుకున్నప్పుడు ఆ ప్రతిపాదనను మైసూరా రెడ్డి స్వాగతించారు. సీమకు గోదావరి జలాలు మాత్రమే శరణ?యమని నాడు ఆయన పదే పదే చెప్పారు. సముద్రంలో కలిసిపోతున్న వెయ్యి టీఎంసీల నీటిని వినియోగించుకుంటే మేలని మైసూరా రెడ్డి ఇరు రాష్ట్ర ప్రభుత్వాలకూ సూచించారు.రాయలసీమ ఎత్తిపోతల పథకం పై తొలి నుంచి మైసూరా రెడ్డి నోరు మెదపడం లేదు. పోతిరెడ్డి పాడు సామర్థ్యం పెంపునకు తొలి నుంచి ఆయన సుముఖంగా లేరు. గోదావరి జలాలనే రాయలసీమకు మళ్లించాలన్న నినాదాన్నే ఆయన విన్పిస్తున్నారు. అయితే రాయలసీమ పరిరక్షణ సమితి పేరుతో సమావేశాలు పెడుతున్న మైసూరా రెడ్డి ఇటీవల జరుగుతున్న జల వివాదాన్ని పట్టించుకోవడం లేదు. అందులో ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం చేసిన నూతన ప్రతిపాదనలపై ఏపీ అంతా నిరసన వ్యక్తమవుతున్నా ఆయన మాత్రం సైలెంట్ గానే ఉన్నారు.నదీ పరివాహక ప్రాంతం పరిధిని బట్టే నీటి కేటాయింపులు జరగాలని తెలంగాణ ప్రభుత్వం కొత్త ప్రతిపాదనను తెచ్చింది. 811 టీఎంసీలలో 500 టీఎంసీలు తమకే దక్కాలని వాదిస్తుంది. ఇది మరింత వివాదానికి దారితీసేలా ఉంది. ఈ పరిస్థితుల్లో ఏపీ ముఖ్యమంత్రి జగన్ కు అండగా నిలవాల్సిన రాయలసీమ పరిరక్షణ సమితి నేత మైసూరారెడ్డి మాత్రం నోరు మెదపడం లేదు. ఇది కరెక్ట్ కాదన్న వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి. సీమ కోసమైనా మైసూరారెడ్డి ముందుకు వచ్చి ఈ కొత్త ప్రతిపాదనపై గొంతు విప్పాలని పలువురు కోరుతున్నారు.

## టీడీపీ కోసం లాబీయింగ్

విజయవాడ, జూలై 19, (న్యూస్ పల్స్)ఆ ఇంటి ఉప్పుతిన్నందుకు విశ్వాసం ఉండాలి. చూపించాలి కూడా. రుణం తీర్చుకోవాలి. లేకుంటే మనిషి అన్న పదానికే విలువ ఉండదు. రాజకీయాల్లో ఈ విశ్వాసం లేదనే చెప్పాలి. తరచూ పార్టీలు మారడం అలవాటుగా మారింది. పార్టీ మారిన తర్వాత తనకు రాజకీయ జన్మనిచ్చిన పార్టీనే విమర్శించే నేతలు కోకొల్లలు. కానీ పార్టీ మారినా తనకు పదవులను కట్టబెట్టిన పార్టీని విస్మరించని నేతలు అరుదుగా ఉంటారు. అందులో రాజ్యసభ ఛైర్మన్ సుజనా చౌదరి ఒకరు.సుజనా చౌదరి రాజ్యసభకు తెలుగుదేశం పార్టీలో ఉండగానే ఎన్నికయ్యారు. చంద్రబాబుకు అత్యంత ఆప్తుడుగా పేరు. పార్టీని కష్టకాలంలో ఆర్థికంగా కూడా ఆదుకున్నాడంటారు. సుజనా చౌదరి గత ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రాగానే టీడీపీని వీడారు. ఇది బీజేపీలో బలవంతపు చేరికే. తనపై ఉన్న సీబీఐ కేసుల నుంచి తప్పించుకునేందుకే సుజనా చౌదరి బీజేపీలో చేరారన్నది వాస్తవం. ఇందుకు చంద్రబాబు అంగీకారం కూడా ఉందనడం కాదనలేం.కానీ ఇప్పుడు సుజనా చౌదరికి చంద్రబాబు బిగ్ టాస్క్ ను అప్పగించినట్లు తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో బలహీనంగా ఉంది. క్యాడర్ లోనూ, నేతల్లోనూ మనోధైర్యం దుర్భిణీ వేసినా కన్పించడం లేదు. పార్టీని గట్టెక్కించాలంటే బీజేపీ సహకారం అవసరం. తమకు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మద్దతు ఉందని తెలిస్తే నేతలు ధైర్యంగా జెండా పట్టుకుని ముందుకు వస్తారు. అందుకే సుజనా చౌదరికి ఈ బాధ్యతను అప్పగించారు.ఇటీవల సుజనా చౌదరి ఢిల్లీలో పలు బీజేపీ నేతలతో వరస సమావేశాలు జరుపుతున్నారు. బీజేపీ జాతీయ సంఘటన ప్రధాన కార్యదర్శి, ఏపీ వ్యవహారాల ఇన్ ఛార్జి శివప్రకాశ్ తో సమావేశమయ్యారు. ఏపీలో బీజేపీని బలోపేతం చేయడానికే ఈ సమావేశం అని బయటకు చెబుతున్నా, సుజనా చౌదరి మాత్రం బీజేపీకి టీడీపీని చేరువ చేసే ప్రయత్నాల్లో భాగమేనని చెప్పకతప్పదు. బీజేపీ పెద్దలను టీడీపీతో పొత్తుకు ఒప్పించేందుకు సుజనా చౌదరి హస్తినలో శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. వరస భేటీలు జరుపుతున్నారు.

## విశాఖలో తోడళ్లుల రాజకీయం

విశాఖపట్టణం, జూలై 19, (న్యూస్ పల్స్)విశాఖలో టీడీపీ చతికిలపడిపోయింది. రెండేళ్ల క్రితం సిటీలో నాలుగు సీట్లు గెలుచుకున్న టీడీపీకి ఇపుడు మాత్రం ఆ ఊపూ ఉత్సాహం ఏ కోశానా లేవు. దాంతో వచ్చే ఎన్నికల నాటికి పసుపు పార్టీని పరుగులు పెట్టించాలని టీడీపీ చూస్తోంది. విశాఖ విషయంలో చంద్రబాబుతో పాటు చినబాబు లోకేష్ కూడా ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారుట. విశాఖను పాలనా రాజధానిగా జగన్ ప్రకటించడంతో టీడీపీకి ఇజ్జత్ మే సవాల్ గా మారుతోంది. ఇప్పటి నుంచే చక్కబెట్టుకోకపోతే రానున్న కాలంలో మరింత డ్యామేజ్ జరుగుతుంది అన్నదే పార్టీ పెద్దల ఆందోళనగా ఉంది.గత ఎన్నికల ముందు బాలక్రిష్ణ అల్లుళ్ళు ఇద్దరు చేరో దారిలో పయనించారు. వారి మధ్య కోఆర్డినేషన్ లోపం వల్లనే పార్టీ బాగా నష్టపోయింది అన్న మాట కూడా ఉంది. చివరిదాకా తేల్చకపోవడంతో భీమిలీ లాంటి కంచు కోటను కోల్పోయామని, ఆ ప్రభావంతో మరో రెండు మూడు సీట్లు కూడా చేజారాయి అన్నది టీడీపీ విశ్లేషణ. ఈసారి అలాంటి పొరపాట్లు రానీయకుండా ముందే తోడల్లుళ్ళు ఇద్దరూ ఒక మాటకు వచ్చారని టాక్. ఈ క్రమంలో భీమిలీ నుంచి లోకేష్ పోటీ చేయాలని, విశాఖ ఉత్తరం నుంచి భరత్ పోటీకి దిగాలని డిసైడ్ అయినట్లుగా భోగట్టా.విశాఖ నుంచి నారా లోకేష్ పోటీ చేస్తే ఆ ప్రభావం ఉత్తరాంధ్ర జిల్లాల మీద బాగా పడుతుందని వూహిస్తున్నారు. నిజానికి ఈ మూడు జిల్లాలూ ఒకనాడు టీడీపీకి పట్టుగొమ్మలే కానీ మారిన రాజకీయంలో వైసీపీ వైపుగా వెళ్ళాయి. అందువల్ల టీడీపీ వైపుగా మళ్ళీ ఈ జిల్లాలు మళ్ళాలి అంటే ఇక్కడ హై కమాండ్ అటెన్షన్ అవసరమని భావించే ఇలా తోడల్లుళ్ళు దిగిపోతున్నారుట. గతసారి ఎంపీగా పోటీ చేసిన భరత్ ఈసారి అసెంబ్లీకి రావడానికి ఉత్సాహం చూపుతూంటే లోకేష్ సైతం దాన్ని ప్రోత్సహిస్తున్నారుట.గతంలో లేని విధంగా తోడళ్ళులు ఒక్కటికావడం వెనక బాలయ్య ఉన్నారని అంటున్నారు. ఈ మధ్య ఆయన ఒక ఇంటర్వ్యూలో కూడా తన ఇద్దరు అల్లుళ్ళూ సమర్ధులే అంటూ కితాబు ఇచ్చారు. అందువల్ల టీడీపీలో అల్లుళ్ళు ఇద్దరూ ఒక వెలుగు వెలగాలని ఆయన ఆకాంక్షిస్తున్నారుట. దానికి తోడు విశాఖ నుంచి నమ్మకమైన పార్టీ నేత టీడీపీకి లేకపోవడం వల్ల కూడా భరత్ మీద దృష్టి పడింది అంటున్నారు. మరి ఇద్దరు తోడల్లుళ్ళూ కలిస్తే విశాఖ సహా ఉత్తరాంధ్రా జిల్లాలలోని టీడీపీకి వైభోగం దక్కుతుందా అన్నది చూడాల్సిందే.

## అనుకున్నదొకటి...అయినాదక్కటి

ఒంగోలు, జూలై 19, (న్యూస్ పల్స్)తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ గా వైవీ సుబ్బారెడ్డి పదవీ కాలం ముగిసింది. ఆయన ప్రస్తుతం ఖాళీగానే ఉంటున్నారు. ఒంగోలు రాజకీయాల్లో తిరిగి చక్రం తిప్పాలని వైవీ సుబ్బారెడ్డి భావిస్తున్నారు. తాను టీటీడీ ఛైర్మన్ గా వెళ్లినా ప్రకాశంతో పాటు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పార్టీ లో ఆయన క్రియాశీలకంగానే ఉన్నారు. కానీ క్యాడర్ కు ఆయన న్యాయం చేయలేకపోతున్నారు. ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గంపైనే ఆయనకు బెంగ ఎక్కువ. ఈ పార్లమెంటు పరిధిలో తన అనుచరులను పార్టీ నేతలు ఎవరూ పట్టించుకోవడం లేదు. టీటీడీ ఛైర్మన్ గా వారిని తాను సమాధానపరుస్తూ వస్తున్నారు.ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, మంత్రి బాలినేని శ్రీనివాసులు రెడ్డి వైవీ సుబ్బారెడ్డి వర్గాన్ని పూర్తిగా దూరం పెట్టారు. పదవుల విషయంలోనూ వారికి న్యాయం చేయలేకపోయానన్న బాధతో వైవీ సుబ్బారెడ్డి ఉన్నారు. దీంతో తిరిగి ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని వైవీ సుబ్బారెడ్డి భావిస్తున్నారు. మాగుంట శ్రీనివాసులు రెడ్డి వైసీపీ పై అసంతృప్తితో ఉన్నారు. వచ్చే ఎన్నికల వరకూ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పార్టీలో ఉంటారా? లేదా? అన్నది కూడా డౌటే. మాగుంట పార్టీ నుంచి వెళ్లిపోతే వచ్చే ఎన్నికలలో ఒంగోలు లోక్ సభ నుంచి పోటీ చేయాలని వైవీ సుబ్బారెడ్డి భావిస్తున్నారు.అలా కాకుండా జగన్ తనకు రాజ్యసభ ఇచ్చినా ఓకే చెప్పడానికి వైవీ సుబ్బారెడ్డి రెడీగా ఉన్నారు. ఎలాగైనా ఒంగోలులో పోయిన గ్రిప్ ను తిరిగి పొందడానికి వైవీ సుబ్బారెడ్డి తిరిగి ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని భావిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఒంగోలు పార్లమెంటు పైనే ఎక్కువ దృష్టి పెట్టారు. ప్రతి రోజు ఒంగోలుకు చెందిన కార్యకర్తలను కలుసుకుంటూ వైవీ సుబ్బారెడ్డి త్వరలో తాను రంగంలోకి దిగుతానని సంకేతాలు ఇస్తున్నారు. దీంతో ఆయన అనుచరుల్లో ఆనందం వెల్లివిరిస్తుంది. టీటీడీ ఛైర్మన్ గా రెండేళ్ల పాటు తాను ప్రభుత్వానికి ఎలాంటి చెడ్డ పేరు తేకుండా పనిచేశానని, జగన్ తనకు గౌరవమైన పదవినే ఇస్తారన్న నమ్మకం ఉందని ఆయన సన్నిహితుల వద్ద వ్యాఖ్యానిస్తున్నట్లు తెలుస్తోంది.ఇస్తే తిరిగి టీటీడీ ఛైర్మన్ పదవి, లేకుంటే రాజ్యసభ తప్పించి మరో పదవిని వైవీ సుబ్బారెడ్డి ఆశించడం లేదు. ఇదే విషయాన్ని జగన్ కు కూడా ఆయన స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇన్నాళ్లూ దైవసేవలో ఉన్నానని, తనకు ప్రజాసేవ చేసుకునే అవకాశం కల్పించాలని జగన్ ను ఆయన కోరినట్లు తెలిసింది. ఇందుకు జగన్ కూడా సుముఖంగా ఉండటంతో వైవీ సుబ్బారెడ్డికి ఏ పదవి ఇస్తారన్నది పార్టీలో చర్చనీయాంశమైంది.

## మళ్లీ తెరపైకి టీటీడీ

తిరుమల, జూలై 19, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఈరోజు బలంగా ఉన్నారు. జగన్ అన్ని రకాలుగా..అన్ని మార్గాల్లో పార్టీని పటిష్టం చేసుకుంటున్నారు. జగన్ పాలనలో అభివృద్ధి లేదని అనడం తప్ప మరేరకమైన ఆరోపణలు చేయలేని పరిస్థితి విపక్షాలది. ఇంకా మూడేళ్ల సమయంలో జగన్ ఎంతో కొంత అభివృద్ధి జరిపి చూపిస్తే అది కూడా ప్రధాన ప్రతిపక్షమైన టీడీపీకి కరవవుతుంది. అందుకే జగన్ ను వేరే రకంగా భ్రష్టు పట్టించాలన్న ప్రయత్నంలో ఉన్నారు.ఆంధ్రప్రదేశ్ లో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రముఖమైనది. వెంకన్న భక్తులు కోట్ల సంఖ్యలో ఉంటారు. తిరుమల సెంటిమెంట్ బలంగా ఉంటుంది. అందుకే ఇప్పుడు తిరుమలను టార్గెట్ గా చేసుకుని టీడీపీ ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లుంది. తిరుమలలో అన్యమత ప్రచారం జరుగుతుందని గతంలో ఆరోపణలు చేసినా దానికి తగిన ఆధారాలను టీడీపీ చూపలేకపోయింది. ఇప్పుడు టీటీడీని ప్రభుత్వ అధీనంలోకి తీసుకువచ్చేందుకు జగన్ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్న దానిపై రచ్చ చేయాలని నిర్ణయించింది.జగన్ ను క్రిస్టియన్ గా జనంలోకి తీసుకెళ్లే క్రమంలో గత ఎన్నికల్లోనూ, మొన్న జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ టీడీపీ విఫలమయింది. జగన్ ఆ విమర్శలు తన దరిచేరవని ఎన్నికల ఫలితాల ద్వారా నిరూపించుకోగలిగారు. అయితే టీడీపీ, బీజేపీ మాత్రం అదే అంశంపై ఎక్కువగా ఆశలు పెట్టుకుంది. స్పెసిఫైడ్ అథారిటీని ఏర్పాటు చేసి టీటీడీ ఆస్తులను కొల్లగొట్టే ప్రయత్నం జరుగుతుందని విమర్శలను ఇప్పటికే టీడీపీ మొదలుపెట్టింది.గతంలో ఆలయాలపై జరిగిన దాడులు, విగ్రహాల విధ్వంసంపైన కూడా టీడీపీ నానాయాగీ చేసింది. అయితే అవి సద్దుమణగడంతో ఇప్పుడు టీటీడీపై టీడీపీ దృష్టి పెట్టింది. ఇక జగన్ పై హిందూ వ్యతిరేక ముద్ర వేయాలన్న ప్రయత్నంలో టీడీపీతో పాటు దాని అనుకూల మీడియా ఉన్నట్లు అర్థమవుతుంది. మున్ముందు మరింత ప్రచారం జగన్ కు వ్యతిరేకంగా జరిగే అవకాశాలున్నట్లు వైసీపీ అధినాయకత్వం గుర్తించింది. అందుకు అనుగుణంగా జగన్ హిందూ దేవాలయాల పర్యటన చేసే అవకాశముందని పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది.

## గోమాతకు ఘన నివాళి

రాజమండ్రి ధవళేశ్వరంలో 15 రోజుల క్రితం రైల్వే స్టేషన్ వద్ద గోమతను పల్సర్ బండి ఢీ కొనడంతో ఆవుకు తీవ్ర గాయాలు అవ్వటం వెంటనే స్పందించిన జంతు ప్రేమికులు ప్రమాదం జరిగిన రోజు నుండి నిరంతరం వైద్య సేవలు అందించారు. పూర్తి స్థాయిలో వైద్యం అందించినప్పటికీ గోమాత తుదిశ్వాస విడిచినది గోశాలలో వసతి కల్పించారు వైద్యం నిమిత్తం చాలా మంది దాతలు సహకారం అందించారు దానికి జంతు ప్రేమికులు అందరూ సంతాపం తెలియజేసి ఆవు దూడ కు ఘనంగా వేదమంత్రాలు దైవ ప్రార్ధన చేసి అంతిమ సంస్కరణలు ధవలేశ్వరం కైలాస భూమి నందు చేసినారు కైలాష్ భూమి సభ్యులు అంతిమ వీడ్కోలు ఘనంగా నిర్వహించారు

### ట్రైకార్ ఛైర్మన్ ను అభినందించిన ఎమ్మెల్యే చెట్టి ఫల్గుణ

విశాఖపట్నం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు ను అయన నివాసంలో అరకు ఎమ్మెల్యే చెట్టి ఫల్గుణ సన్మానించారు. బుల్లిబాబుకు పుష్పగుచ్చం అందించి,దుశ్శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్సీపీ పార్టీలో కష్ట పడి పనిచేసిన వాళ్లకి గుర్తింపు లభిస్తుందనే దానికి నిదర్శనం. అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి సతక బుల్లిబాబు ను ఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ గా అవకాశం కల్పించడమే అని అన్నారు ఈ అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కు, రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి కు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీకి మొదటి నుంచి విధేయుడిగా ఉంటూ కష్టపడుతూ,నిజమైన, నిఖార్సైన,నమ్మకమైన కార్యకర్త తన వంతు సహాయసహకారాలు అందించిన సతక బుల్లిబాబు కు రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ గా బాధ్యతలు అప్పగించడం ఆనందనీమమైన విషయమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివప్రసాద్ యువనేత గొడ్డేటి మహేష్,కుమార్,కూడ అరున్ ప్రకాశ్,తదితరులు పాల్గొన్నారు.

# మాల్స్ కు మరోసారి దెబ్బ

హైదరాబాద్, జూలూ 19, (న్యూస్ పల్స్)న్యూమర్లు పెద్ద పెద్ద మాల్స్‌కు వెళ్లడానికి ప్రధాన కారణం అక్కడున్న షాప్‌లు, ఫుడ్ కోర్టులు, సినిమా హాల్సే. కానీ, కరోనా దెబ్బకు వీటి బిజినెస్‌లు దెబ్బతిన్నాయి. ఇంకా పుంజుకోకపోవడంతో ఈ ఏడాది కూడా రెంట్లను తగ్గించాలని మాల్స్ ఓనర్లను యాంకర్ టెనంట్లు (ఎక్కువ రెంట్ కట్టే వాళ్లు) కోరుతున్నాయి. మాల్స్ కూడా యాంకర్ టెనంట్లను వదులుకోవడానికి సిద్ధంగా లేకపోవడంతో రెంట్లను తగ్గిస్తున్నాయి. ఆర్థిక సంవత్సరం 2020?21 లో యాంకర్ టెనంట్లకు రెంట్లలో రాయితీలిచ్చిన మాల్స్, ఈ ఏడాది రికవరీ బాట పడతాయని భావించాయి. కానీ, ఈ ఏడాది కరోనా సెకెండ్ వేవ్ రావడం, త్వరలో థర్డ్ వేవ్ కూడా వస్తుందనే వార్తలొస్తుండడంతో రెంట్లను తగ్గించక తప్పదని ఎనలిస్టులు చెబుతున్నారు. మాల్స్‌కి జనాన్ని తెప్పించే వాటిలో సినిమా హాల్స్ ముఖ్యంగా ఉంటాయి. కరోనాకి ముందు మాల్స్‌కి వచ్చే కస్టమర్లలో సినిమాలు చూడడానికి వచ్చే వారి వాటా 30?40 శాతం వరకు ఉండేది. కానీ కరోనా దెబ్బకు సినిమా థియేటర్లు ఓపెన్ కావడంలో రిస్ట్రిక్షన్లు ఉన్నాయి. కరోనా ఫస్ట్ వేవ్ తగ్గాక సినిమా హాల్స్ ఓపెన్ అయ్యాయి. కానీ, కేవలం 50 శాతం కెపాసిటీతోనే నడిచాయి. దీంతో మల్టిప్లెక్స్ ఆపరేటర్లు తీవ్రంగా నష్టపోతున్నాయి. ఉదాహరణకు అతిపెద్ద మల్టిప్లెక్స్ ఆపరేటర్ పీవీఆర్ సేల్స్ కరోనా దెబ్బకు భారీగా పడ్డాయి. కంపెనీకి 2019?20 ఆర్థిక సంవత్సరంలో సినిమా టికెట్లను అమ్మడం వల్ల రూ. 1,731.15 కోట్ల రెవెన్యూ వచ్చింది. కరోనా వలన 2020?21 లో ఈ రెవెన్యూ రూ. 101.85 కోట్లకు తగ్గింది. ఫుడ్, సాఫ్ట్ డ్రింక్‌లను అమ్మడం వలన వచ్చే రెవెన్యూ రూ. 960.46 కోట్ల నుంచి రూ. 75.55 కోట్లకు తగ్గిపోయింది. కంపెనీకి వచ్చే యాడ్స్ ఇన్‌కమ్ కూడా పడిపోయింది. 2019?20 లో రూ. 375.88 యాడ్ రెవెన్యూ రాగా, 2020?21 లో రూ. 17.8 కోట్ల రెవెన్యూ మాత్రమే వచ్చింది. పెద్ద పెద్ద మాల్స్‌కి పీవీఆర్ పెద్ద మొత్తంలో రెంట్ కడుతోంది. కానీ, కంపెనీ బిజినెస్ దెబ్బతినడంతో రెంట్లను తగ్గించాలని మాల్ ఓనర్లను డిమాండ్ చేస్తోంది. ఫీనిక్స్, డీఎల్ఎఫ్, నెక్సస్ వంటి పెద్ద మాల్స్ కూడా కిందటేడాది కంపెనీ కట్టే రెంట్‌ని పెద్ద మొత్తంలో తగ్గించాయి. కరోనాకు ముందు (2019?20 లో) రెంట్ల కోసం రూ. 577.42 కోట్లను కట్టిన పీవీఆర్, 2020?21 లో రూ. 119.87 కోట్లను మాత్రమే రెంట్‌గా కట్టింది. కామన్ ఏరియా మెయింటెనెన్స్ కోసం కట్టే రెంట్ రూ. 154.78 కోట్ల నుంచి రూ. 90.52 కోట్లకు తగ్గింది. 'రెంట్స్, కామన్ ఏరియా మెయింటెనెన్స్‌లలో రాయితీ ఇవ్వాలని మాల్‌ఓనర్లతో చర్చలు జరుపుతున్నాము. ఈ ఏడాది మార్చి నాటికి తిరిగి బిజినెస్‌లన్నీ పుంజుకుంటాయని అనుకున్నాం. దురదృష్టవశాత్తు కరోనా సెకెండ్ వేవ్‌తో దేశంలోని మాల్స్, సినిమా హాల్స్, షాపింగ్ సెంటర్లన్నీ మూతపడ్డాయి' అని పీవీఆర్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ నితిన్ సూద్ అన్నారు. కేవలం సినిమా థియేటర్లే కాదు, ఇతర యాంకర్ టెనంట్ల పరిస్థితి కూడా పీవీఆర్ పరిస్థితిలానే ఉంది. కస్టమర్లను మాల్స్‌కి ఆకర్షించడంలో ఫుడ్ కోర్టులు ముందుంటాయి. కానీ, మొత్తం రెస్టారెంట్ ఇండస్ట్రీలో మార్పు కనిపిస్తోంది. క్విక్ సర్వీస్ రెస్టారెంట్లకు హోమ్ డెలివరీ వలన రెవెన్యూ పెరుగుతోంది. ఉదాహరణకు బర్గర్ కింగ్‌కే ఈ ఏడాది మొదటి మూడు నెలల్లో 38?43 శాతం సేల్స్ రెవెన్యూ హోమ్ డెలివరీల వలనే వచ్చింది. మెక్‌డొనాల్డ్స్ రెస్టారెంట్లను నడుపుతున్న వెస్ట్‌లైఫ్ కు హోమ్ డెలివరీల సేల్స్ పెరిగాయి. గ్రోసరీ, క్లాత్స్, ఎలక్ట్రానిక్స్ బిజినెస్‌లు తమ ఆన్‌లైన్ ఛానెల్‌ను విస్తరించడానికి ఇన్వెస్ట్ చేస్తున్నాయి. బిజినెస్ మోడల్స్‌ను మారుస్తూనే రెంట్లపై రాయితీ పొందుతున్నాయి. ఉదాహరణకు ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్ 2020?21 లో రెంట్లపై రూ. 343.72 కోట్లను సేవ్ చేయగలిగింది. కంపెనీ రెంట్ల ఖర్చు రూ. 487.02 కోట్ల నుంచి రూ. 10.67 కోట్లకు తగ్గింది. బిజినెస్ లేకపోవడంతో పూర్తి రెంట్‌ను కట్టలేమని యాంకర్ టెనంట్లు మాల్ ఓనర్లకు చెప్పేస్తున్నాయి. మాల్స్ కూడా తమ యాంకర్ టెనంట్లను వదులుకోవడానికి సిద్ధంగా లేకపోవడంతో, రెంట్లను తగ్గించడానికి ఒప్పుకుంటున్నాయి. మరోవైపు ఇతర సెగ్మెంట్లకు చెందిన క్లయింట్లను ఆకర్షించాలని చూస్తున్నాయి. 'కొత్త విధానాలకు అలవాటు పడాల్సిన టైమ్ వచ్చిందని తెలుస్తోంది' అని నెక్సల్ మాల్ పేర్కొంది. హెల్త్‌కేర్, ఎడ్యుటెక్ వంటి సెక్టార్లలోని కంపెనీలను ఆకర్షించాలని మాల్స్ చూస్తున్నాయి.

## గుత్తావల్లిలో స్పీకర్ తమ్మినేని పర్యటన


శ్రీకాకుళం జూలై 19, (న్యూస్ పల్స్) శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం గుత్తావల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శాసన సభాపతి తమ్మినేని సీతారాం శంకుస్థాపన చేశారు. ముందుగా జగనన్న పచ్చతోరణం హరితవనహారం లో భాగంగా లాభం నుండి గుత్తావల్లి వెళ్ళే రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా గుత్తావల్లి గ్రామం లో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం అదే గ్రామంలో బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్ కు శంకుస్థాపన చేశారు. చివరగా జగనన్న కాలనీలో ఇల్లు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా స్పీకర్ తమ్మినేని మాట్లాడుతూ పాలనా వ్యవస్థ కు జీవం పోస్తూ ప్రతి రెండు పంచాయతీలను ఒక క్లస్టర్ గా ఏర్పాటు చేసి అక్కడే సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రం, బల్క్ కూలింగ్ సెంటర్లు ఏర్పాటు చేసుకుని ప్రతి 50 ఇళ్లకు ఒక వాలంటీర్లు ను పెట్టి పాలనా వ్యవస్థను అందుబాటులో ఉంచిన ఘనత భారతదేశంలో జగన్మోహన్రెడ్డి ప్రభుత్వానిదే ఆయన ప్రమాణ స్వీకారం చేసిన రోజే చెప్పారు అవినీతి లేని పారదర్శకమైన ప్రభుత్వాన్ని ప్రజలకు అందిస్తామని చెప్పి స్వపరిపాలన కు నాంది పలికిన ఒక గొప్ప ముఖ్యమంత్రి ప్రగతి రథ సదాకుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి క్యాష్ ట్రాన్స్ఫర్ సిస్టం ద్వారా అవినీతి లేని పాలన అందిస్తున్నారు విజ్ఞానవంతమైనటువంటి సమాజ నిర్మాణంలో వ్యవసాయదారుడు నిలబడాలని రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు సలహాలు,సూచనలు అందించి అధునాతన వ్యవసాయ పద్ధతుల ద్వారా నిలదొక్కుకునే విధంగా ప్రభుత్వం అండగా ఉంటుంది. పల్లెలను ప్రగతి పథంలో నడిపించిన నాడు నిజమైన ప్రభుత్వమని స్పీకర్ తమ్మినేని అన్నారు.

## కరోనా భయం?..యేడాదిన్నర పాటు గదిలోనే

రాజమండ్రి జూలై 19, (న్యూస్ పల్స్) కరోనా మహమ్మారి యావత్ ప్రపంచాన్నే హడలెత్తిస్తోంది. జనాలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఓ కార్యానికి వెళ్లలేక, ఓ విహార యాత్రకు వెళ్లలేక.. ఆఖరికి తమ ఇంటి నుంచి పక్కింటికి వెళ్లాలన్నా భయపడిపోతున్నారు. తేడా వస్తే ప్రాణాలే పోతాయని భయం వారిలో చేరింది. అయితే, కరోనా ఎఫెక్ట్కు సంబంధించి తూర్పుగోదావరి జిల్లా రాజోలు మండలం కడలి గ్రామంలో విచిత్ర సంఘటన వెలుగు చూసింది. కరోనా సోకుతుందనే భయంతో ఓ కుటుంబ సభ్యులు.. ఏడాదిన్నర కాలంగా స్వీయ గృహ నిర్బంధంలో ఉండిపోయారు. కరోనా భయంతో ఒకే గదిలో ఏడాదిన్నర నుంచి జీవనం సాగిస్తున్నారు. అయితే మరీ చిత్రంగా కాలకృత్యాలు, నిద్రాహారాలు అన్నీ అదే ఒకే గదిలో కానిచ్చేస్తున్నారు ఆ కుటుంబ సభ్యులు. ఈ కుటుంబంలో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు ఉండగా.. తండ్రి చుటుకుల బిన్ని, కుమారుడు మాత్రమే అడపాదడపా బయటకు వస్తుంటారు.అయితే, ఇంటి స్థలం విషయంలో బయోమెట్రిక్ ద్వారా వేలిముద్ర వేయించేందుకు అధికారులు వారిక ఇంటికి వెళ్లగా అసలు విషయం బయటపడింది. స్థలం విషయమై వేరిఫికేషన్ కోసం వచ్చిన వాలంటీర్కు. ఆ కుటుంబ సభ్యులు షాకింగ్ ఆన్సర్ ఇచ్చారు. ఇంట్లోనే ఉండి తమకు స్థలం వద్దని, తాము బయటకు రామని తెగేసి చెప్పారు.

వారు అలా అనడానికి గల కారణం ఏంటా అని ఆరా తీస్తే అసలు విషయం తెలిసి షాక్ అయ్యారు. ఈ విషయంపై గ్రామ సర్పంచ్.. అధికారులకు సమాచారం అందించారు. రాజోలు ఎస్ఐ కృష్ణమాచారి ఆధ్వర్యంలో వారిని ఇంటికి బయటకు వచ్చేలా చేశారు. అయితే ఏడాదిన్నర కాలంగా ఒకే గదిలో కాలకృత్యాలు, నిద్రాహారాలు చేయడంతో ఇంట్లో ఉంటున్న ముగ్గురు మహిళ ఆరోగ్యం క్షీణించిపోయింది. వారికి చికిత్స అందించేందుకు రాజోలు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతానికి వారి ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు

## ముంబాయిలో స్తంభించిన జనజీవనం



ముంబాయి జూలై 19, (న్యూస్ పల్స్) దేశ ఆర్థిక రాజధాని ముంబాయిలో భారీ వర్షాలతో జనజీవనం స్థింభించిపోయింది. బోరివలీలో వరదల ధాటికి పార్క్ చేసిన వాహనాలు కొట్టుకుపోయాయి. కుండపోత వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్లలోకి నీరు చేరగా ప్రజలు అవస్థలు పడ్డారు. జోరు వానలకు పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భారీవర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, సబర్బన్ రైలు సర్వీసులకు అంతరాయం కలిగింది. సోమవారం కూడా ముంబయితో పాటు పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసాయి. వాతావరణ శాఖ ఇదివరకు జారీ చేసిన గ్రీన్ అలర్ట్ను రెడ్ అలర్ట్గా మార్చింది. ముంబయిలో కేవలం 6 గంటల వ్యవధిలోనే 100 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది. గత 24 గంటల్లో 120 మిల్లిమీటర్ల వర్షం కురిసినట్లు ఐఎండీ తెలిపింది. ముంబయి చెంబూర్, విక్రోలిలో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. మూడు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో మొత్తం 25 మంది మృతి చెందారు. చెంబూర్ ప్రాంతంలోని భరత్ నగర్ కాలనీలో ఓ ప్రహరీ గోడ కూలి గుడిసెలపై పడిన ఘటనలో 17 మంది ప్రాణాలు కోల్పోగా.. మిక్రోలిలో భవనం కూలి ఏడుగురు చనిపోయారు.ముంబయి చెంబూర్, విఖ్రోలిలో జరిగిన ప్రమాదాలపై రాష్ట్రపతి రామ్నాథ్ కోవింద్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధి పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి రూ.2లక్షలు పరిహారంగా అందిస్తున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటించింది. క్షతగాత్రులకు రూ.50 వేల సాయం అందిస్తామని తెలిపింది. మరోవైపు మహారాష్ట్ర సర్కారు మృతుల కుటుంబాలకు 5 లక్షల రూపాయల చొప్పున నష్టపరిహారం ప్రకటించింది. భారీ వర్షాలతో వరదలు ముంచెత్తుతున్న నేపథ్యంలో ప్రజలకు పలు సూచనలు చేసింది ముంబయి మహా నగర పాలక సంస్థ. మంచినీటిని కాచి, చల్లార్చిన తర్వాతే తాగాలని కోరింది. వరదలతో విద్యుత్తు పరికరాలు దెబ్బతిన్నాయని, దాంతో పంపులు, ఫిల్టర్ ప్రక్రియ వ్యవస్థ ఆగిపోయినట్లు పేర్కొంది. .. కొద్ది గంటల్లోనే నీటి సరఫరా వ్యవస్థను పునరుద్ధరించారు.

## పాలకొండలో కళా వెంకట్రావు పర్యటన

శ్రీకాకుళం శ్రీకాకుళం జిల్లా పాలకొండ లో మాజీ రాష్ట్ర టిడిపి అధ్యక్షులు కిమిడి కళా వెంకట్రావు పర్యటించారు. ముందుగా ఇటీవల మరణించిన మాజీ కౌన్సిలర్ కోలా కృష్ణమూర్తి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తనకి 25 మంది ఎంపీలు ఇస్తే కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి ప్రత్యేక హోదా తీసుకొస్తానని ఎన్నికల ముందు చెప్పారని నేడు కేంద్ర ప్రభుత్వం దగ్గర మోకరిల్లి లేరని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను మోసం చేశారని జాబ్ లెస్ క్యాలెండర్ విడుదల చేశారని విమర్శించారు. అధికారంలోకి వస్తే ?3000 పెన్షన్ ఇస్తామని చెప్పి నేటికీ రెండు సంవత్సరాలు పూర్తయిన దాన్ని అమలు చేయలేదని విమర్శించారు. మద్యం రేట్లు విపరీతంగా పెంచి పేదవాడిని దోచుకుంటున్నారని తెలియజేశారు. ఈరోజు నిరుద్యోగం తలపెట్టిన తాడేపల్లి నిరసన కార్యక్రమాన్ని ముందుగానే నిరుద్యోగులు తమ ఇంటి దగ్గర హౌస్ అరెస్ట్ చేశారని తెలిపారు.

## ఐ.టి.డి.ఏ. పి.ఓ పై ఆరోపణలు చేయడం అన్యాయం

### మంత్రి అనిల్ కు అరవ పూర్ణ వినతి

నెల్లూరు జూలై 19, (న్యూస్ పల్స్)నీతి ,నిజాయితీ గల దళిత అధికారి , పేదల పెన్నిది ఐ.టి.డి.ఎ పీ ఓ అయిన మణికుమార్ పై అసత్య ఆరోపణలు చేసి , దళితుల ఆత్మగౌరవాన్ని దిగజారుస్తున్న గిరిజన నాయకులు అని చెప్పుకొని తిరుగుతున్న కె.చినపెంచలయ్య , గిరిజన ఉపాధ్యాయుడైన చేవూరు సుబ్బారావు ల పై తగు విచారణ జరిపి న్యాయం చేయాలని రాష్ట్రజలవనరుల శాఖా మంత్రి డా ? పోలుబోయిన అనీల్ కుమార్ యాదవ్ కు మంత్రి కార్యాలయం లో ఏ.పి దళితసేన రాష్ట్రకార్యదర్శి అరవపూర్ణప్రకాష్ నేతృత్వంలో వినతిపత్రం అందచేసి మాట్లాడారు. చిన్న పెంచలయ్య అనే అతను గిరిజన సంఘాన్ని అడ్డం పెట్టుకుని దళిత ఉద్యోగులను , గిరిజన హాస్టల్ల అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తూ , వారి పై అసత్య ఆరోపణలు చేయడం అన్యాయంఅని తెలిపారు. మంత్రి స్పందించి జిల్లా కలెక్టర్ గారితో మాట్లాడి వీరి ఇరువురిపై విజిలెన్స్ చే విచారణ జరిపి గట్టి చర్యలు తీసుకోవాలని తెలిపారు. మరోమారు ఇటువంటి పరిణామములు తలెత్తకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో దళిత ,గిరిజన నాయకులు కరుణాకర్ , పోతురాజు రవి, రాజారావు, కైలాసం సతీష్ , రాజన్ , నారాయణ, భాస్కర్ , లింగాల రవి , చేను సుజాత , గోనె సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

## రైతు చైతన్య యాత్రలో పాల్గొన్న ఏ వో బాలకృష్ణ నాయక్

దర్శి జూలై 19, (న్యూస్ పల్స్)ప్రకాశం జిల్లా దర్శి మండలం లో సోమవారం దర్శి మండలం వ్యవసాయధికారి చందలూరు , వేంకటా చలం పల్లి గ్రామాలకు చెందిన రైతులకు బాలకృష్ణ నాయక్ ఆధ్వర్యంలో చందలూరు రైతు భరోసా కేంద్రం లో రైతు భరోసా చైతన్య యాత్రలను నిర్వహించడం జరిగింది .ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో ఉన్న వివిధ పథకాల గురించి వివరిస్తూ రైతులు వేసిన పంటలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పంట నమోదు చేసుకొనవలెను అని, దీనివల్ల కలుగు ప్రయోజనాలు గురించి వివరించడం అయినది. అలాగే కౌలుకు వేసే రైతులు కౌలుదారు కార్డులు పొందవలెనని వాటి యొక్క ప్రయోజనాల గురించి వివరించారు. రైతు భరోసా కేంద్రం లో జరుగు ప్రయోజనాల గురించి వివరిస్తూ ఎరువులు, పురుగు మందులు ,విత్తనాలను గ్రామంలోనే అందుబాటులో ఉన్నాయని తెలియజేసినారు. విత్తనాలు కావాల్సిన వారు రైతు భరోసా కేంద్రం లో నమోదు చేసుకోవాలని, రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడటం వల్ల భూమి యొక్క సారం తగ్గిపోయి ఎందుకు పనికిరాకుండా పోతున్నాయని కావున ప్రతి రైతు తగిన మోతాదులో మాత్రమే ఎరువులను వాడవలెను. అని తెలియజేశారు. ఉద్యానవన అధికారి ఆది రెడ్డి మాట్లాడుతూ ఉద్యాన శాఖ లో ఉన్నటువంటి వివిధ పథకాల గురించి వివరిస్తూ మిరప పంటను వేసే రైతులు విత్తనాలు ఎంపిక విషయంలో జాగ్రత్తలు వహించాలని, ప్రతి రైతు నీటి కుంటలు కూడా ఏర్పాటు చేసుకోవాలని, ఫార్మ్ పొండ్ , శాశ్వత పందిర్లు ,కొత్తగా వేస్తున్న పండ్ల,కూరగాయల,పూల తోటలు వేసే రైతులు ప్రస్తుతం ప్రభుత్వ రాయితీ కోసం రైతు భరోసా కేంద్రం ద్వారా ధరకాస్తు చేసుకోవాలని , మరియు వివిధ పదకాల గురించి కూడా వివరించారు . పశుసంవర్ధక శాఖ డాక్టర్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ పశువులకు వచ్చే వ్యాధులు వాటి నివారణ చర్యలు గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, పశుసంవర్ధక శాఖ లోని వివిధ పథకాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో దర్శివ్యవసాయ శాఖ అధికారి బాల క్రిష్ణ నాయక్ ,ఉద్యాన శాఖ అధికారి పి.ఆదిరెడ్డి, చందలూరు వి హెచ్ ఏ డి . జాన్ గార్డెన్ , వేంకటాచలం పల్లి వి ఏ ఏ సోమ్లా నాయక్ , పశు సంవర్ధక శాఖ సిబ్బంది , గ్రామ సర్పంచ్ లు , రైతులు సోదరులు పాల్గొన్నారు.

## అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

నెల్లూరు జూలై 19, (న్యూస్ పల్స్)అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు సునీల్ యాదాల అన్నారు. ఆదివారం రాత్రి నెల్లూరులో గూడూరు ఒకటవ పట్టణ పోలీసులు సునీల్ ను అదుపులోకి తీసుకున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు నూతన జాబ్ క్యాలెండర్ ను విడుదల చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ల ఆధ్వర్యంలో సోమవారం చలో విజయవాడ కార్యక్రమం చేపట్టేందుకు సిద్ధమవుతుండగా ఈ విషయం తెలుసుకున్న గూడూరు ఒకటవ పట్టణ పోలీసులు ఎస్ఐ బ్రహ్మ నాయుడు ఆదేశాల మేరకు నెల్లూరుకు చేరుకుని సునీల్ ను అదుపులోకి తీసుకున్నారు. సునీల్ ను గూడూరుకు తరలించారు. సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా సునీల్ యాదాల మాట్లాడుతూ మాట తప్పని మడమ తిప్పని సీఎం జగనన్నకు ఏమైందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా పెరుగుతోందన్నారు. ఎన్నికల ముందు ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి మొక్కుబడిగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం దారుణమన్నారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన చలో విజయవాడ కార్యక్రమాన్ని ఉక్కుపాదంతో అణిచివేయడం దుర్మార్గమన్నారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభించేంత వరకూ పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. అలాగే ఆదివారం ఏఐవైఎఫ్ గూడూరు పట్టణాధ్యక్షులు నిరంజన్ కుమార్ ను అదుపులోకి తీసుకున్నారు. సొంతపూచీకత్తుపై విడుదల చేశారు.

### గ్రామాలలో ఉచితంగా వైస్సార్ కంటి వెలుగు పరీక్షలు

తుగ్గలి జూలై 19, (న్యూస్ పల్స్)మండల పరిధిలోని మారుమూల గ్రామాలలో కూడా ఉచిత వైయస్సార్ కంటి వెలుగు పరీక్షలను నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి,వీఆర్వో వెంకన్న లు తెలియజేశారు.తుగ్గలి మండల పరిధిలోని ఉప్పరపల్లె గ్రామంలో సోమవారం రోజున వైయస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా ఉచితంగా గ్రామాల్లో వృద్ధులకు సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం గ్రామంలోని 12 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో పేదలకు ఎన్నో విధాలుగా కుల,మతాలకు భేదం లేకుండా అందరికీ సమాన సుపరిపాలన అందిస్తున్నారని ఆయన తెలియజేశారు.ఉచితంగా రాష్ట్ర ప్రభుత్వం అందించే ఎన్నో సేవలను మారుమూల ప్రాంతాలకు అందించిన ఘనత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమం లో వైయస్సార్ కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల ప్రెసిడెంట్ భీమానాయక్,ఉప సర్పంచ్ రామాంజనేయులు, ఏఎన్ఎం పుష్ప మరియు ఆశావర్కర్లు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# హోటళ్లలో పరిశుభ్రత, నిర్వహణ చక్కగా ఉండాలి

## టిటిడి అదనపు ఈవో ఎవి.ధర్మారెడ్డి

తిరుమల, జూలై 19, ( విభారె) తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా హోటళ్లలో పరిశుభ్రత, నిర్వహణ చక్కగా ఉండేలా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని టిటిడి అదనపు ఈవో ఎవి.ధర్మారెడ్డి కోరారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో సోమవారం హోటళ్ల నిర్వాహకులు, ఆస్థానమండపంలో స్థానికులు, దుకాణాల వ్యాపారులతో అదనపు ఈవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హోటళ్ల నిర్వాహకుల సమావేశంలో అదనపు ఈవో మాట్లాడుతూ భక్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన భోజనం అందించేందుకు తిరుమలలోని 15 ప్రాంతాల్లో లాభాపేక్ష లేకుండా హోటళ్లు నిర్వహించేందుకు పలువురు వ్యక్తులు, సంస్థలు ముందుకొస్తున్నాయని చెప్పారు. అన్ని హోటళ్లలో ధరల పట్టికలు కనిపించేలా ఏర్పాటుచేయాలని, కంప్యూటరైజ్డ్ బిల్ ఇవ్వాలని, డిజిటల్ చెల్లింపులను అనుమతించాలని, పరిశుభ్రత, నిర్వహణ చక్కగా ఉండాలని సూచించారు. హోటళ్లు, దుకాణాల్లో అగ్నిమాపక పరికరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. లీజు పొందినవారు సబ్‌లీజుకు ఇవ్వరాదన్నారు. సేకరణకు వీలుగా తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయాలన్నారు.

ఆస్థానమండపంలో అదనపు ఈవో మాట్లాడుతూ తిరుమలలోని దుకాణాలు, హాకర్ లైసెన్సులు, బాలాజినగర్‌లోని ఇళ్లను కొంతమంది అనధికారికంగా పొందినట్లు సమాచారం ఉందని, కావున ప్రతి లైసెన్సును క్షుణ్ణంగా తనిఖీ చేసి సక్రమంగా ఉన్నవారికి ఫొటో గుర్తింపుకార్డు మంజూరు చేస్తామన్నారు. స్థానికుల వివరాలన్నింటినీ కంప్యూటర్‌లో నమోదు చేస్తామని తెలిపారు. అలిపిరి చెక్‌పాయింట్ వద్ద భక్తులతో కలిసి చెక్ చేసుకోవడం ఇబ్బందిగా ఉందని స్థానికులు విజ్ఞప్తి చేశారని, వీరికోసం ప్రత్యేక వరుస ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్థానికులు పలు సమస్యలు తెలియజేశారని, తన పరిధిలో ఉన్నవాటిని వెంటనే పరిష్కరిస్తానని, మిగతా సమస్యలను ఈవో దృష్టికి, బోర్డు దృష్టికి తీసుకెళతామని వివరించారు.

# ప్రజల సమస్యల పరిష్కారం కోసమే స్పందన

## నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

నంద్యాల జులై 19 ( విభారె) ప్రజల సమస్యల పరిష్కారం కోసమే స్పందన కార్యక్రమము నిర్వహించు తున్నాము. ప్రజలు సద్వినియోగం చేసుకోవలని నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. సోమవారం నంద్యాల సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో నంద్యాల సబ్ కలెక్టర్, సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారి హరినాథ్ రావు లతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం నంద్యాల సబ్ కలెక్టర్ కుమారి చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ సోమవారం రోజు నంద్యాల సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం లో భాగంగా నంద్యాల రెవెన్యూ డివిజన్ నలుమూలల నుండి వచ్చిన వినతులను స్వీకరించామన్నారు. నంద్యాల రెవెన్యూ డివిజన్ లోని 17 మండల తహసిల్దార్ వారి కార్యాలయంలలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి వినతులను స్వీకరించడం జరుగుతుందన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సచివాలయ వ్యవస్థలో క్షేత్రస్థాయిలో కూడ వినతులు స్వీకరించబడు తాయి అని అన్నారు. వినతి దారులు సచివాలయాల్లో. తహసీల్దార్ కార్యాలయాల్లో. సమస్యలు లు పరిష్కారం కానప్పుడు రెవిన్యూ డివిజనల్ ఆఫీసు కు రావాలన్నారు. సోమవారం జరిగిన స్పందన కార్యక్రమం లో ఎక్కువ శాతం భూముల సర్వే చేయించాలని. భూములను ఆక్రమించారని. భూములు ఆన్లైన్లో నమోదు చేయించాలని. పరం పోగు భూముల్లో పట్టాదారు పాసు పుస్తకాలు కావాలని. ప్రభుత్వం ఇచ్చినటువంటి గృహాలను ఆక్రమించుకున్నారు. పంట భూములకు రస్తా కావాలని. నంద్యాల మండలం బాబూజీ నగర్ గ్రామంలో స్మశానవాటిక కు స్థలం కావాలని. నంద్యాల మండలం బిల్లా పురం గ్రామం లో రోడ్డు నిర్మాణం కొరకు ఎలాంటి నోటీసు లేకుండా మా భూములను ఆక్రమించుకున్నారు అని. తెలుపుతూ వినతులు అందాయన్నారు. సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి దాదాపుగా.24 వినతులు అందినవని ఆమె అన్నారు.

# ముస్లిం గరీబ్ సహారా కమిటీ సేవలు ప్రశంసనీయం

## మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్ జులై 19 ( విభారె) ముస్లిం గరీబ్ సహారా కమిటీ సేవలు ప్రశంసనీయమని మున్సిపల్ చైర్మన్ సప్త శైల రాజేష్ అన్నారు, స్థానిక పాతపెట లో సోమవారం ఉదయం ముస్లిం సహారా కమిటీ ఆధ్వర్యంలో 200 ముస్లింల పేద కుటుంబాలకు ఫారీద్ మిత్ర బృందం ఆర్థిక సహకారం తో బక్రీద్ పండుగ సందర్భంగా 10 రకాల నిత్యావసర సరుకుల ను మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ,వైసీపీ నాయకులు పోస్ట్ ప్రసాద్ చేతుల మీద ముస్లిం కుటుంబాలకు ఐవడం జరిగింది, ఈ సందర్భంగా మునిసిపల్ చైర్మన్ రాజేష్ మాట్లాడుతూ ముస్లిం సహోదారులందరు ఈ పండుగ ను కోవిడ్ నియమాలను పాటిస్తూ, భక్తి శ్రద్దలతో నిర్వహిచలని విజెప్తి చేశారు, కార్యక్రమంలో ఫారీద్ మిత్ర బృందం, సభ్యులు గురుప్రసాద్, శేఖర్ రెడ్డి, మురారిపట్టణ ప్రముఖ వైసీపీ నాయకులు పోస్ట్ ప్రసాదు లు అన్నారు . మిత్ర భృంధం ఆర్థిక సహకారం తో బక్రీద్ పండుగను పురస్కరించుకుని నిత్యావసర సరుకులను మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ,వైసీపీ నాయకులు పోస్ట్ ప్రసాద్ ల చేతులమీదుగా ఉచితంగా అందచేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో ,కోవిడ్ నిబంధనలు పాటిస్తూ బక్రీద్ వేడుకలను నిర్వహించుకోవాలని సూచించారు

# ప్రజలు, వ్యాపారస్తుల సహకారానికి కృతజ్ఞతలు

## మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

### కెటి రోడ్డులు విస్తరణ పనులు స్వయంగా పరిశీలించిన మంత్రి

### మూడు రోడ్ల కూడలి నుండి ఇందిరా చౌక్ వరకు కాలి నడకన పనులు పరిశీలన

పలాస జూలై 19, ( విభారె) పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో కెటి రోడ్డు విస్తరణకు సహకరిస్తున్న వ్యాపారస్తులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను అని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ, పాడి పరిశ్రమాభివృద్ది శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. సోమవారం స్థానిక కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి నుండి పలాస ఇందిరా చౌక్ వరకు రోడ్డు పనులు పరిశీలించారు. రాష్ట్ర మంత్రి స్వయంగా కాలి నడకన నడుచుకుంటూ దుకాణు దారులతో మాట్లాడుతూ ముందుకు సాగారు. కెటి రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాకు ,ఇళ్లు ప్రభుత్వ నిబంధనలను అనుసరిస్తూ పనులు జరుగుతుండటం చూశారు. 80 అడుగుల విస్తీర్ణంతో కెటి రోడ్ ఆధునీకరణ చేయడం జరుగుతుందని అన్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఇరుకు రోడ్లుపై ట్రావెల్ చేయడం ఇబ్బందులకు గురికావడం జరుగుతుందని. పలాస నియోజకవర్గంలో పలాస కాశీబుగ్గ పట్టణం మూడు మండలాల ప్రజలకు ఎంతో అవసరమైన పట్టణం అని తెలిపారు. వాస్తవంగా పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో రోడ్లు అభివృద్ధి చెందితే పట్టణాన్ని సుందరంగా మార్చుకునే అవకాశం ఉందని అన్నారు. మన పట్టణం మనం అభివృద్ధి చెందే దిశగా పనులు ప్రారంభంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వచ్ఛందంగా పనులు చేయడం చూస్తే ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. అభివృద్ధికి అందరూ భాగస్వామ్యం కావడం ఇది శుభపరిణామం అని చెప్పారు. పలాస నియోజకవర్గంలో మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాలతో పాటు పలాస కాశీబుగ్గను సమూలంగా అభివృద్ధి చేసుకుని సుందర పట్టణంగా మార్చుతానని ప్రజలకు హామి ఇచ్చారు. ప్రజల నిత్యవసరాలకు నిత్యం పలాస కాశీబుగ్గ పట్టణంకి రాక పోకలు సాగిస్తారని రోడ్లు విస్తీర్ణం కావడంతో ట్రాఫిక్ సమస్యల నుండి బయట పడతామని అన్నారు. పలాస కాశీబుగ్గ కెటి రోడ్డు విస్తరణ లో భాగంగా ముందుగా డ్రైనేజి, ఫుట్ పాత్ నిర్మాణానికి పూర్తి స్థాయి నిధులు మంజూరు చేయించుకున్నామని తెలిపారు. రోడ్డు నిర్మాణానికి వీలైనంత విస్తీర్ణం వరకు అడ్డంకులు

తొగించిన వెంటనే డ్రైనేజి, ఫుట్ పాత్ నిర్మాణం కూడా చేపడతామని అన్నారు. ప్రజలు ఎంతగా సహకరిస్తే అంత వేగం అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉందని అన్నారు. ఏది ఏమైనా ప్రజలు, వ్యాపారుల మద్దతు పూర్తిస్తాయిగా ఉందని స్వచ్ఛందంగా విస్తరణ పనులలో కట్టడాలను తొలిగించడం చూస్తే వారందరికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున మంత్రిగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ, ఆర్ అండ్ బి సిబ్బంది, ఎలక్ట్రికల్ సిబ్బందు, తోపాటు వైసిపి నాయకులు,కౌన్సిలర్లు పలువురు పాల్గొన్నారు.

# విద్యార్థి నాయకులను అరెస్టు చేయడం దుర్మార్గం

## . యూత్ కాంగ్రెస్


కడప జులై 19 కడప కాంగ్రెస్ పార్టీ కార్యాలయము లోపుల్లయ్య మాట్లాడుతూ...జాబ్ క్యాలెండర్ను వ్యేతిరేకిస్తు విజయవాడ వెళ్లిన విద్యార్థుల అక్రమ అరెస్టును యువజన కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెప్పలి పుల్లయ్య ఖండించారు. ఈ సందర్బంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూముఖ్యమంత్రి జగన్ రెడ్డి ప్రకటించిన జాబ్ క్యాలెండర్ పై శాంతియుతంగా మాట్లాడటానికి వెళ్తున్న విద్యార్థి నాయకులను అరెస్ట్ చేయటం దారుణమన్నారు.విద్యార్థుల అరెస్టుల పరిస్థితి చూస్తుంటే మనం ప్రజాస్వామ్య పాలనలో ఉన్నామా ? లేక నియంతృత్వ పాలన లో ఉన్నామా అనేది అర్థంకాకుండా ఉందన్నారు లక్షలాదిమంది విద్యార్థులు పెద్ద చదువులు చదివి ఉద్యోగాల కోసం పడిగాపులు కాస్తుంటే ఉద్యోగాలు కల్పించలేని రాష్ట్ర ప్రభుత్వం, ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న విద్యార్థులపై కనికరం లేకుండా, మానవత్వం లేకుండా అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గపు చర్య అన్నారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహులు ప్రధాన కార్యదర్శి అమీర్లు పాల్గొన్నారు.

# రౌడీ షీటర్స్ కు కౌన్సిలింగ్...

## ఎస్.ఐ షామీర్ భాష

తుగ్గలి జూలై 19, ( విభారె) తుగ్గలి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో గల రౌడీ షీటర్లకు తుగ్గలి షామీర్ భాష కౌన్సిలింగ్ ఇచ్చారు.సోమవారం రోజున మండల కేంద్రమైన తుగ్గలి స్థానిక పోలీస్ స్టేషన్ నందు ఎస్.ఐ షామీర్ బాషా రౌడి షీటర్స్ తో మాట్లాడుతూ గ్రామాలలో ఎటువంటి అల్లర్లు మరియు గొడవలు సృష్టించకుండా ప్రశాంతంగా జీవించాలని ఎస్.ఐ తెలియజేసారు.గ్రామాలలో ఎవరైనా శాంతి భద్రతలకు విగాదం కలిగిస్తే ఎవరినైనా ఉపేక్షించేది లేదని,వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్.ఐ షామీర్ బాషా హెచ్చరించారు.గ్రామాలలో ఎవరైనా సమస్యలు సృష్టిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్.ఐ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మాధవ స్వామి,పోలీస్ కానిస్టేబుల్ సుశీల,తుగ్గలి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నయా ట్రెండ్.. రెండు భాగాల ప్లాన్ బాగా వర్కవుటవుతోందా?



ఇటీవలి కాలంలో మల్టీస్టారర్ ట్రెండ్ ఊపందుకున్న తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. బహుభాషల్లో రిలీజ్ చేసేందుకు నిర్మాతలు ఎక్కువ ఆసక్తిగా ఉన్నారు. దీంతో పాటే రెండు భాగాలుగా సినిమాలు తీయడం అన్నది ఫ్యాషన్ గా మారింది. మొదటి భాగం బంపర్ హిట్ కొడితే రెండో భాగంతో భారీ లాభాలార్జించే టెక్నిక్ ని వర్కవుట్ చేస్తున్నారు. అయితే దీనికి ఆద్యం మాత్రం బాహుబలి ఫ్రాంఛైజీ అని చెప్పాలి. దర్శకధీరుడు రాజమౌళితో కలిసి దీనికి ఆజ్యం పోసింది ది గ్రేట్ ఆర్కా మీడియా.నిజానికి బాహుబలి చిత్రాన్ని ఒక భాగంగా తెరకెక్కించాలని రాజమౌళి తొలుత భావించినా కథను డెవలప్ చేసే క్రమంలో రెండు భాగాలకు స్కోప్ లభించింది. మొదటి భాగంలో వై కట్టప్ప కిల్డ్ బాహుబలి ? అంటూ సస్పెన్స్ ని క్రియేట్ చేసి బాహుబలి ఫ్రాంఛైజీని సంచలన విజయం వైపు నడిపించారు. మార్కెటింగ్ టెక్నిక్ లోనూ జాతీయ సినిమాకే నేర్పించారు మనోళ్లు.బాహుబలి స్ఫూర్తితోనే కేజీఎఫ్ ఫ్రాంఛైజీని రెండు భాగాలు గా రూపొందిస్తూ ప్రశాంత్ నీల్ సంచలనాలకు తెరతీసారు. కేజీఎఫ్ చాప్టర్ 1 సంచలన విజయం సాధించడంతో అతడు వెంటనే పార్ట్ 2 ని ప్రారంభించారు. త్వరలోనే కేజీఎఫ్ చాప్టర్ 2 ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద సంచలనాలకు తెర తీసేందుకు సిద్ధమవుతోంది.ఆ తర్వాత ఈ ఫార్మాట్ ని అనుసరించే దర్శకనిర్మాతలు పెరిగారు. మలయాళంలో దృశ్యం ఫ్రాంఛైజీ ఇలానే సక్సెసైంది. దృశ్యం క్లైమాక్స్ లోనే సీక్వెల్ కథ ఉంది అంటూ ఎలివేట్ చేసిన దర్శకుడు జీతూ జోసెఫ్ తెలివిగా రెండ బాగాన్ని గ్రిప్పింగ్ గా తెరకెక్కించి సక్సెస్ చేశారు.ఇప్పుడు సుకుమార్ దర్శకత్వంలో పుష్ప ఇదే కేటగిరీలో రూపొందుతోంది. పుష్ప డ్యూయాలజీ పేరుతో రూపొందుతున్న ఈ సిరీస్ లో తొలి భాగం ఈ ఏడాది రిలీజవుతుంది. కొంత గ్యాప్ తర్వాత సుకుమార్ సెకండ్ పార్ట్ ని ప్లాన్ చేస్తారు. స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ ఇందులో ఎర్రచందనం స్మగ్లర్ గా మాస్ అవతార్ లో కనిపిస్తున్నారు. ఇక పార్ట్ 1 వర్కవుటైతే పార్ట్ 2ని అంతకుమించి అనేలా రూపొందించాలన్న ప్లాన్ ఉంది.బాహుబలి.. దృశ్యం ఫ్రాంఛైజీలు రెండు భాగాలతో ఈ ఫార్మాట్ లో ఘనవిజయాల్ని అందుకోగా కేజీఎఫ్ 2 సంచలనాల కోసమే ప్రస్తుతం వెయిటింగ్. అయితే అన్ని సినిమాలు బాహుబలి .. కేజీఎఫ్ కాలేవు. కొన్నిటికి కథల పరంగా పరిమితులు ఉంటాయన్నది పరిశీలించాలి. ఇక బాహుబలి తరహాలోనే ఆర్.ఆర్.ఆర్ కి సీక్వెల్ ఆలోచన జక్కన్న మైండ్ లో ఉందా? అన్నదానికి ఇప్పటివరకూ ఎలాంటి ఆన్సర్ లేదు. అది జక్కన్న మాత్రమే ప్రకటించాల్సి ఉంటుంది.ఇకపోతే తమిళంలో చియాన్ విక్రమ్ నటించిన 'ధృవ నక్షత్రం' చిత్రాన్ని రెండు భాగాలుగా రిలీజ్ చేసేందుకు గౌతమ్ మీనన్ బృందం సన్నాహకాల్లో ఉందని తెలిసింది. నిజానికి ధృవనక్షత్రం చాలా కాలం ఆలస్యమైన ప్రాజెక్ట్. బడ్జెట్ పరిమితుల కారణంగా ఈ చిత్రం మూడేళ్ళకు పైగానే ల్యాబుల్లో చిక్కుకుంది. ఎట్టకేలకు వెల్స్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ ఈ ప్రాజెక్టును హస్తగతం చేసుకుని రీవ్యాంప్ చేస్తోంది. ప్రొడక్షన్ హౌస్ సన్నిహిత వర్గాల సమాచారం ప్రకారం ..ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయబోతున్నారు. గౌతమ్ మీనన్ ఈ చిత్రానికి నాలుగున్నర గంటల ఫుటేజ్ ని చిత్రీకరించారు కాబట్టి రెండు భాగాల రిలీజ్ నిర్ణయం తీసుకున్నారని తెలిసింది.

# నిర్మాతగా మారిన స్టార్ హీరోయిన్.. 'అవుట్ సైడర్స్' పేరుతో కొత్త బ్యానర్..!



సినీ ఇండస్ట్రీలో అనేక మంది హీరోలు సొంత నిర్మాణ సంస్థలు పెట్టుకొని సినిమాలు నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు హీరోయిన్లు కూడా నిర్మాతలుగా మారారు. ఇప్పుడు సొట్టబుగ్గల సుందరి తాప్సీ పన్ను కూడా ప్రొడ్యూసర్ అవతారం ఎత్తింది. 'ఝుమ్మందినాధం' సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన తాప్సీ.. ఆ తర్వాత పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. అలానే బాలీవుడ్ లో అడుగుపెట్టిన తాప్సీ.. లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో సత్తా చాటింది. ప్రస్తుతం అక్కడ బిజీ హీరోయిన్లలో ఒకరిగా కొనసాగుతోన్న ఈ బ్యూటీ ఇప్పుడు నిర్మాతగా మారుతోంది. దీని కోసం 'అవుట్ సైడర్స్ ఫిలింస్' అనే పేరుతో ఓ నిర్మాణ సంస్థను ప్రారంభించారు.'సూపర్ 30' '83' 'సూర్మ' 'పికూ' 'ముబాకరన్' వంటి సినిమాలను నిర్మించిన ప్రముఖ బాలీవుడ్ నిర్మాత రచయిత ప్రంజల్ ఖంద్ దియా భాగస్వామ్యంలో తాప్సీ సినిమాలు నిర్మించనుంది. ఈ విషయాన్ని తాప్సీ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. గతేడాదితో ఇండస్ట్రీకి వచ్చి పదేళ్లు పూర్తయ్యాయని.. ఇన్నేళ్లలో చాలా నేర్చుకున్నానని తెలిపింది. ఈ ప్రయాణంలో అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ తాను కృతజ్ఞతలు చెబుతున్నానని..ఇక ఇప్పుడు ఇండస్ట్రీకి తిరిగి ఇచ్చే సమయం ఆసన్నమైందని.. అందుకే నిర్మాణ రంగంలోకి అడుగుపెడుతున్నానని తాప్సీ పేర్కొన్నారు. దీనికి తనకు అదృష్టం కలగాలని కోరుకుంటున్నానని.. అవుతూ సైడ్ నుండి ఉత్తమమైనదాన్ని తీసుకురావడానికి నా వంతు ప్రయత్నం చేస్తానని ప్రామిస్ చేస్తున్నానని తాప్సీ చెప్పుకొచ్చారు.ఈ నేపథ్యంలో తాప్సీ తన 'అవుట్ సైడర్స్ ఫిలింస్' ప్రొడక్షన్ హౌజ్ లో ఫస్ట్ సినిమాని ప్రకటించారు. అజయ్ భాల్ దర్శకత్వంలో "బ్లర్" అనే చచిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. జీ స్టూడియోస్ మరియు ప్రంజల్ ఖంద్ దియాలతో కలిసి తాప్సీ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. ఈ సందర్భంగా "బ్లర్" చిత్రానికి సంబంధించిన ఇంట్రెస్టింగ్ ఫస్ట్ లుక్ పోస్టర్ ని విడుదల చేశారు. 2022లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. మరి హీరోయిన్ గా సక్సెస్ అయిన తాప్సి.. నిర్మాతగా ఏమేర రాణిస్తుందో చూడాలి.కాగా తాప్సి లీడ్ రోల్ చేసిన 'హసీనా దిల్ రుబా' సినిమా ఓటీటీ వేదికగా విడుదలై మంచి ఆదరణ దక్కించుకుంటోంది. ఇది ఆమె కెరీర్లో డైరెక్ట్ గా ఓటీటీలో రిలీజ్ అయిన ఫస్ట్ సినిమా. విక్రాంత్ మాస్సే – హర్షవర్ధన్ రాణే కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి వినీల్ మాథ్యూ దర్శకత్వం వహించారు. రాఘవేంద్రరావు మాజీ కోడలు కనికా థిల్లాన్ కథ – స్క్రీన్ ప్లే – డైలాగ్స్ అందించారు. టీ సిరీస్ ఫిలిమ్స్ మరియు కలర్ ఎల్లో ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై ఈ సినిమా రూపొందింది.ఇకపోతే తెలుగులో చివరగా 'గేమ్ ఓవర్' అనే బైలింగ్వల్ లో కనిపించిన తాప్సీ.. ఇన్నాళ్లూ మంచి కథ కోసం ఎదురుచూసింది.సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 'ఏజెంట్ సాయి శ్రీనివాస్' ఫేమ్ స్వరూప్ ఆర్.ఎస్.జె దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. మ్యాట్నీ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై నిరంజన్ రెడ్డి – అన్వేష్ రెడ్డి లు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# తెలుగులోనూ ఛాన్సొస్తే తూఫాన్ సృష్టిస్తాడట



బాలీవుడ్ లో క్రేజీ హీరో కం దర్శకనిర్మాతగా సుపరిచితుడు ఫర్హాన్ అక్తర్. ఎన్నో బ్లాక్ బస్టర్ చిత్రాల్లో నటించి నిర్మాతగానూ పాపులరయ్యారు. సాహో ఫేం శ్రద్ధా కపూర్ తో అతడి సహజీవనం గురించి అప్పట్లో ఆసక్తికర చర్చ సాగింది. ప్రస్తుతం అతడు గాయని కం నటి శిబానీ దండేకర్ తో ప్రేమాయణం సాగించడం తెలిసినదే. తాజాగా ఫర్హాన్ నటించిన తూఫాన్ హిందీ చిత్రం 16 జూన్ రిలీజ్ కి రెడీ అవుతోంది.భాగ్ మిల్కా భాగ్ తరువాత తూఫాన్ లాంటి స్పోర్ట్స్ డ్రామాతో అతడు మెస్మరైజ్ చేసేందుకు సిద్ధమవ్వడంతో అభిమానుల్లో హాట్ టాపిక్ గా మారింది. ఈ సినిమా ఎలా మొదలైంది? అన్నదానికి ఆయన తాజా చాటింగ్ లో మాట్లాడుతూ.. 'భాగ్ మిల్కా భాగ్' ఫేం రాకేశ్ జీతో నాకు అద్భుతమైన అనుబంధం ఉంది. అతను నన్ను పిలిచి మరో స్పోర్ట్స్ డ్రామా ఉందని చెప్పిన క్షణం చాలా సంతోషించాను. బాక్సర్ అజీజ్ అలీ పాత్రను విన్న క్షణం నేను వెంటనే సినిమాకు ఓకే చెప్పాను అని ఫర్హాన్ తెలిపారు.తూఫాన్ లో అతడు అజ్జు భాయ్ గా కనిపించనున్నారు. ముంబైలోని మురికివాడ ప్రాంతమైన డోంగ్రిలోని అజ్జు భాయ్ అకా అజీజ్ అలీ అత్యంత ప్రసిద్ధ చెందిన తపోరి ఫైటర్. అందరూ అతనికి భయపడతారు.అతను ఒక విచిత్ర సంఘటనతో బాక్సింగ్ లోకి వస్తాడు. ఇది అతని జీవితాన్ని మారుస్తుంది. భౌతిక కోణం కంటే అజీజ్ అలీలోని ఎమోషనల్ యాంగిల్ సినిమా ఆద్యంతం వేడెక్కిస్తుందని ఫర్హాన్ తెలిపారు.రాకేశ్ ఓం ప్రకాష్ మెహ్రా చిత్రాలలో బలమైన ఎమోషన్ ఉంటుంది. అతని పాత్రలన్నీ డెప్త్ ఉన్న కథను కలిగి ఉంటాయి.






EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**